ప్రజాపక్షం
PRAJAPAKSHAM
స్తంభాద్రి భద్రాద్రి
గురువారం | 04 | జూలై | 2024
పేజీలు 8

# వీరత్వం నింపిన అమరత్వం

నేడు దొడ్డి కొమరయ్య 78వ వర్ధంతి



ఓ మరణం విప్లవోద్యమానికి ఊపిర్లూ ఊదింది. సామాన్యులను సైతం సాయుధులను చేసేలా పోరాటం చేసింది. ఒక రక్కసి ప్రభుత్వాన్ని నేలకూల్చింది. దశాబ్దాల తరబడి ని బంచాన్ దొర అంటూ సాగిన పడిన ప్రజలు స్వేచ్ఛావాయువులు పీల్చేలా చేసింది. ఆయనే దొడ్డి కొమరయ్య. ప్రపంచ చరిత్రలో సువర్ణాక్షర లిఖితమైన సాయుధ తెలంగాణ పోరాట తొలి అమర వీరుడు దొడ్డి కొమరయ్య. ఆయన మరణం యావత్ తెలంగాణలో ఒక ఆలోచనను కలిగించింది. కలబడక పోతే నిలబడలేమన్న ఒక స్ఫూర్తినిచ్చి దొరల గాడీలను బద్దలు కొట్టేలాచేసింది. ఆ అమరత్వానికి నేటికి 78 ఏళ్లు. తెలంగాణ సాయుధ పోరాటంలో నాలుగున్నర వేల మంది అమరులయ్యారు. ఆ అమర వీరుల్లో తొలి వాడు దొడ్డి కొమరయ్య. జనగామ ప్రాంతంలో కడవెండి అనే గ్రామంలో దొడ్డి కొమరయ్య జన్మించాడు. ఆ గ్రామం విసూనూర్ దేశ్‌ముఖ్ రామచంద్రారెడ్డి ఏలుబడిలో ఉండేది. ఆమె తల్లి జానకమ్మ. ఆమె క్రూరత్వం మూర్తిభవించిన మహిళ. బానిసలుగా మార్చి వెట్టి చాకిరి చేయించుకోవడం తో పాటు ఎదురు తిరిగితే ప్రాణాలు తీసేందుకు కూడా వెనుకాడేది కాదు. అటువంటి ఆ గ్రామానికి సాయుధ తెలంగాణ పోరాట పిలుపునిచ్చిన ముగ్గురిలో ఒకరైన ఆరుట్ల రామచంద్రారెడ్డి వెళ్లి ఆంధ్ర మహాసభ సందేశం వినిపించి గ్రామ సంఘాన్ని ఏర్పాటు చేశాడు. అనేక మంది యువకులు గ్రామ సంఘాల్లో పని చేయడానికి ముందుకు రాగా అందులో దొడ్డి మల్లయ్య, దొడ్డి కొమరయ్య లు ఉన్నారు. మల్లయ్య, కొమరయ్య లు అన్నదమ్ములు. పండిన పంటను దోచుకుపోయి గడీకి చేర్చి ప్రజలను పస్తులు ఉంచే వారు. ఈ సమయంలోనే సంఘ కార్యకలాపాలు ఊపందుకున్నాయి. గడీ దొరల పెత్తనం క్రమేపి తగ్గిపోతుందని భావించి ఒక రౌడీల గుంపును తయారు చేసి గ్రామం పై పడి తాగి, తిని కార్యకర్తలను హింసించడం మొదలుపెట్టారు. అదే సమయంలో విసూనూర్ దేశ్‌ముఖ్ రామచంద్రారెడ్డి మేనమామ గడ్డం నర్సింహారెడ్డి అరాచకవాదులను వెంటేసుకుని ప్రజలను ఇబ్బందులు పెడుతుండే వాడు. ఇటు వైపు యువకులు ఒడిసెళ్ల ద్వారా రాళ్లు విసరడంలోను, కర్ర సాములు నేర్చుకుని రౌడీ ముఖలను ఎదుర్కొనేందుకు సిద్దమయ్యారు. జంపాల లింగయ్య అనే రైతు ఇంటి పై జమీందారు రౌడీలు రాళ్లు విసరడం ప్రారంభించడంతో లింగయ్య భార్య లచ్చమ్మ సంఘ కార్యాలయానికి వెళ్లి దాడి సమాచారం ఇచ్చింది. వందలాది మంది కార్యకర్తలు మోహన్‌రెడ్డి నాయకత్వంలో కర్రలు చేతబూని ప్రదర్శనగా బయలుదేరారు. రావినారాయణరెడ్డికి జై, ఆంధ్ర మహాసభకు జై అంటూ బయలు దేరారు. అప్పుడే గొర్రెలు కాయడానికి వెళ్లి ఇంటికి వచ్చిన కొమరయ్యకు ఆ నినాదం చెవిన పడింది. గబగబ లేచి ఓ గుత్ప అందుకుని జనంలో కలిశాడు. మిస్కినాలి అనే రౌడీ గుంపు నాయకుడు జనం మీదకు కాల్పులు జరిపాడు. మల్లయ్య భుజంలోకి తుపాకీ గుండు దూసుకుపోయింది. బండారు ఐలయ్య, కొండయ్య, నర్సింహా అనే వ్యక్తులు తీవ్రంగా గాయపడగా దొడ్డి కొమరయ్య కడుపులో నుంచి తూటాలు దూసుకెళ్లడంతో తీవ్రంగా గాయపడి మరుసటి రోజు ఉదయం కన్నుమూశాడు.దొడ్డి కొమరయ్య మరణ వార్త చుట్టు పక్కల గ్రామాలకు చేరింది. వందలాది మంది జనం బయలు దేరారు. దేశ్‌ముఖ్ గడీలో తిష్టవేసిన రౌడీలను తరిమి తరిమి కొట్టారు. ఆ రోజుల్లో అనేక ప్రాంతాల నుండి ఐదారు వేల మంది సాయుధులై కడవెండికి తరలి వచ్చారంటే ఆశ్చర్యం కలుగక మానదు. తెలంగాణ గడ్డ పై అమరుడైన దొడ్డి కొమరయ్య యావత్ తెలంగాణ ఉద్యమ విజయానికి కారకుడయ్యాడు. కొమరయ్య లాంటి అమరుల త్యాగాలు లేకుంటే భారతదేశ నడిబొడ్డున మరో కశ్మీర్‌లా హైదరాబాద్ సంస్థానం రగులుతూనే ఉండేది.

**అందుకో జోహార్లు కొమరయ్య**
**నిన్ను బలిగొన్నట్టి నీచులను దునిమాడి**
**నిన్ను గన్నట్టి ఈ తెలుగు గడ్డను మేము**
**స్వాతంత్రముగ జేసి శాంతించేదమే గాని**
**నీ పేరు నిలపకనే కొమరయ్య**

మేము నిదరైన పోమోయి కొమరయ్య అంటూ శపథం చేసి అనుకున్నది సాధించారు. తెలంగాణ నిజాం రక్కస ప్రభుత్వాన్ని కూల్చడమే గాక గడీల రాజ్యాన్ని పారద్రోలి ప్రజా రాజ్యాన్ని నిర్మించారు. ఆ అమరుడు దొడ్డి కొమరయ్యను తెలంగాణ ప్రజలు ఇప్పటికీ ఎప్పటికీ మరచిపోరు. తెలంగాణ పదం ఉన్నంత కాలం సాయుధ పోరాటం స్మూరణకు వచ్చిన ప్రతిసారి అమరుడు కొమరయ్య అందరి మదిలో మెదులుతూనేఉంటాడు. నాటి పోరాట వారసత్వాన్ని కొనసాగిస్తూ ప్రజల సమస్యలపై నిరంతరం స్పందించడమే కొమరయ్యకు సరైన నివాళి.

-ప్రజాపక్షం/ ఖమ్మం

## బయటపడుతున్న
# పింఛన్ల బాగోతం..!

-అనర్హులకు దివ్యాంగుల పింఛన్లు
-లంచం తీసుకుని మంజూరు చేసిన అధికారులు
-విచారణ జరిపితే అనేక విషయాలు వెలుగులోకి..

2 లో





## భవిష్యత్తు తరాల కోసమే
# వన మహోత్సవం



2 లో

-మొక్కలు నాటిన మంత్రులు పొంగులేటి, కొండా సురేఖ
-సత్తుపల్లిలో ర్యాలీ

# సిపిఐకి పెరుగుతున్న జనాదరణ

-కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని
-కూనంనేని సమక్షంలో వంద కుటుంబాలు సిపిఐలో చేరిక

2 లో



# బయటపడుతున్న పింఛన్ల బాగోతం..!



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఉమ్మడి ఖమ్మంజిల్లాలో పింఛన్లకు సంబంధించి అనేక మంది అనర్హులకు అందుతున్నట్లు ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయి. రాజకీయ పలుకుబడితో కొందరు, అధికారులకు డబ్బులు ఎర వేసి మరి కొందరు పింఛన్లు పొందారు. క్షేత్ర స్థాయి సిబ్బంది తీరు కూడా ఎద్దు ఈనిందంటే గాటికి కట్టేయ్యమన్నట్లు పింఛన్లు పొందే వ్యక్తి అర్హుడా, అనర్హుడా అని చూడకుండా కనీస పరిశీలన లేకుండానే పని చేస్తున్నారు. ఇటీవల ఒక ప్రభుత్వ ఉద్యోగి వికలాంగుల పింఛన్ పొందుతున్న వ్యవహార గుట్టు రట్టయింది. ఈ క్రమంలోనే వృద్ధాప్య, వికలాంగుల పింఛన్లకు సంబంధించి పలువురు అనర్హులు పింఛన్లు పొందుతున్నట్లుగా ఆరోపణలు వినవస్తున్నాయి. ఈ విషయమై కొందరు ప్రభుత్వ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ గత ప్రభుత్వంలో అధికారులు పట్టించుకోలేదని ప్రభుత్వం మారిన తర్వాతనైనా ప్రభుత్వాన్ని మోసం చేసి పింఛన్లు పొందుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. గ్రామాల వారీగా పరిశీలన చేస్తే అనేక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. మరి కొందరు పింఛన్‌దారులు మరణించినప్పటికీ ఆ విషయాన్ని సమాచారం ఇవ్వకుండా నెలల తరబడి పింఛన్‌ను ఖాతాలో వేయించి సంబంధిత వ్యక్తులు కాజేస్తున్నారన్న ఫిర్యాదులు కూడా వెల్లువెత్తుతున్నాయి. 40 శాతం అంగవైకల్యం ఉంటేనే పింఛన్‌కు అర్హులు కాని 10 శాతం అంగ వైకల్యం లేని వ్యక్తులు కూడా పింఛన్ పొందే విషయంలో జిల్లా ప్రధాన ఆసుపత్రిలోని కొందరు అధికారులు సదరం క్యాంపుల్లో వచ్చిన దరఖాస్తుల విషయంలో సంప్రదింపులు జరిపి భారీ మొత్తంలో నగదు పుచ్చుకుని పింఛన్లు మంజూరు చేశారు. పింఛన్ల మంజూరు అక్రమ పద్దతిలో పొందిన వారిపై తగు చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ వినవస్తుంది. జిల్లాలో అక్రమంగా పింఛన్లు పొందిన విషయంలో పూర్తి స్థాయిలో విచారణ చేసి అనర్హులను పింఛన్ నుంచి తొలగించాలని కోరుతున్నారు.

## పార్కులను సందర్శించిన కమిషనర్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని పలు పార్కులను ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య సందర్శించారు. బుధవారం ఖమ్మం నగరంలోని లకారం ట్యాంక్ బండ్, గోళ్లపాడు ఛానల్, వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్‌ను నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య సందర్శించారు. పార్కుల వివరాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అక్కడ వసతులు సరిగ్గా ఉన్నాయా లేదా పార్కులకు సందర్శకులు ఏఏ సమయాల్లో అనుమతిస్తున్నారు, పార్కులను ఎవరు మెయింటిన్ చేస్తున్నారు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా ఇబ్బందులు, సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని అధికారులకు సూచించారు.

# భవిష్యత్తు తరాల కోసమే వన మహోత్సవం



**ప్రజాపక్షం/ ఖమ్మం :** భవిష్యత్తు తరాల కోసం ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ లు తెలిపారు. వన మహోత్సవంలో భాగంగా బుధవారం ఖమ్మంజిల్లా సత్తుపల్లి మండలం గొల్లగూడెం గ్రామంలో మొక్కలు నాటారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో గొల్లగూడెం అటవీలో 33320 మొక్కలను నాటే కార్యక్రమాన్ని మంత్రులు ప్రారంభించారు. ఈ సందర్బంగా అటవీ ఉత్పత్తుల స్టాల్స్‌ను, ఫోటో ప్రదర్శనలు మంత్రులు తిలకించారు. అనంతరం సత్తుపల్లిలోని జలగం వెంగళరావు కళాశాలలో వన మహోత్సవం పై అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ఈ సదస్సులో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ మనిషి మనుగడకు పచ్చదనం ఎంతో ముఖ్యమన్నారు. ఆరోగ్యంగా మన పూర్వీకులు వందేళ్లు బతికారంటే అందుకు చెట్లే కారణమన్నారు. మొక్కనుండి మనం చాలా లబ్ది పొందుతున్నామని పచ్చదనం గొప్పతనాన్ని ప్రతి ఒక్కరికి తెలియజేయాలన్నారు. పచ్చదనం మధ్యకు వెళితే ఒత్తిడికి దూరమై ప్రశాంతత కలుగుతుందని చెట్లను పెంచడం చాలా కష్టమని కాని నరికివేయడం చాలా తేలిక అని పొంగులేటి తెలిపారు. ప్రతి ఒక్కరు ఒక మొక్క నాటి సంరక్షించే బాధ్యతను తీసుకుంటే పచ్చదనం వెల్లివిరుస్తుందని ఆయన తెలిపారు. 20 ఏళ్ల నుండి ఆశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యతనిస్తుందని కులాలు, మతాల మధ్య సమతుల్యతను పాటిస్తూ అభివృద్ధిలో పయనిస్తుందన్నారు. అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ సమాజం ఆరోగ్యంగా ఉండాలంటే మొక్కల పెంపకం జరగాలన్నారు. చల్లని నీడనిచ్చే చెట్లు కనుమరుగవుతున్నాయని ఇది అత్యంత బాధాకరమని సురేఖ తెలిపారు. 1959లో కేంద్ర మంత్రి మున్షి వన మహోత్సవానికి నాంది పలికారని ఇప్పుడు వజ్రోత్సవ వన మహోత్సవ కార్యక్రమం జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 20 వేల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామని 14వేల నర్సరీలలో 22 కోట్ల మొక్కలను పంపిణీకి సిద్దం చేశామన్నారు. మొక్కలు నాటి సంరక్షించేందుకు అన్ని శాఖలు తమ తమ ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. మొక్కలను పెంచితే ఆక్సిజన్‌తో పాటు పండ్లు, ఫలాలు అందిస్తాయని తెలిపారు. ప్రైవేటు వ్యక్తులు కూడా మొక్కలు పెంచుతామంటే అందజేస్తామని సురేఖ తెలిపారు. సమాజం బాగుండడం కోసం వన మహోత్సవ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని ఇది భవిష్యత్తు తరాలకు ఇబ్బందికరంగా మారుతుందని అందు కోసం మొక్కలు నాటేందుకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి శాసన సభ్యురాలు మట్టా రాగమయి, అటవీ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి అహ్మద్ నదీమ్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, అటవీ సంరక్షణ అధికారి డి. భీమా నాయక్, ఖమ్మంజిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రం సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సన్యాసయ్య, జెడ్పి సిఈవో వినోద్, డిపివో హరికిషన్, ప్రముఖ కవి, ప్రకృతి ప్రేమికుడు జయరాజ్, ఆర్డివో ఎల్. రాజేందర్, మున్సిపల్ ఛైర్మన్ కె. మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి ఇంజనీరింగ్ కౌన్సిలింగ్

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఇంజనీరింగ్ కళాశాలలో ప్రవేశాలకు నిర్వహించే కౌన్సిలింగ్ ప్రక్రియ నేటి నుంచి ప్రారంభం కానుంది. మొదటి విడత కౌన్సిలింగ్ బుధవారం నుంచి ప్రారంభం కానుండగా ఖమ్మంలోని ఎస్ఆర్అండ్ బిజిఎన్ఆర్ డిగ్రీ కళశాలలో కౌన్సిలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎంసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులకు ఈనెల నాలుగు నుంచి కౌన్సిలింగ్‌కు సంబంధించి స్లాట్ బుకింగ్ చేసుకునే అవకాశం కల్పించారు. స్లాట్ బుక్ చేసుకున్న విద్యార్థులకు ఆరవ తేదీ నుంచి వారు ఎంచుకున్న తేదీ, సమయాల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు కౌన్సిలింగ్ కేంద్రానికి హాజరు కావాల్సి ఉంది. ఈనెల నాలుగు నుంచి 12వ వరకు స్లాట్ బుకింగ్, ఆరునుంచి 13 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్, ఎనిమిది నుంచి15 వరకు వెబ్ ఆప్షన్ల నమోదు, ఈనెల 19న సీటు ఎలాట్‌మెంట్ చేపట్టనున్నారు. ఈనెల 19 నుంచి 23 వరకు సీటు వచ్చిన విద్యార్థులకు ఫీజు చెల్లింపులు, కళాశాలలో సెల్ఫ్ రిపోర్టింగ్‌కు అవకాశం కల్పించారు. ఖమ్మంజిల్లాలో మొత్తం ఎనిమిది ఇంజనీరింగ్ కళాశాలలు ఉండగా ఇంజనీరింగ్‌లో అర్హత సాధించిన విద్యార్థి రాష్ట్ర వ్యాప్తంగా ఏ ఇంజనీరింగ్ కళాశాలలోనైనా ప్రవేశం పొందేందుకు అవకాశం ఉంది. తమకు నచ్చిన కళాశాల్లో వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. మొదటి విడత ప్రక్రియ పూర్తయిన తర్వాత ఈనెల 26 నుంచి రెండవ విడత, ఆగష్టు ఎనిమిదిన మూడవ విడత కౌన్సిలింగ్ నిర్వహించనున్నారు. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్‌ను కాని, కౌన్సిలింగ్ కేంద్రంలో కాని సంప్రదించవచ్చు.

## సైబర్ నేరాలపై జాగ్రత్తలు వహించాలి




**ప్రజాపక్షం/ఏన్కూరుః** సైబర్ నేరాలపై జాగ్రత్తలు వహించాలని ఏన్కూరు ఎస్సై బాదావత్ రవి కోరారు. ఖమ్మం పోలీస్ కమీషనర్ సునీల్‌దత్ ఆదేశాల మేరకు బుధవారం స్థానిక యూనియన్ కళాశాలలో సైబర్ జాగృతి దివాస్ అవగాహన కార్యక్రమంలో భాగంగా సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువకులు కొత్త కొత్త యాప్‌ల ద్వారా అంత మోసపోతున్నారని, మీకు డబ్బులు వస్తాయి అని చెప్పి ఓటిపి లాంటివి అడిగితే చెప్పవద్దని కోరారు. ఈజీగా డబ్బులు సంపాదించే విధంగా యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకుంటున్నారని, అలాంటివి చేయవద్దని ఆయన తెలిపారు. అలా ఎవరైనా ఓటిపిలు అడిగినట్లయితే 1930 కాల్ చేసి తెలుపగలరని అన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రాజా, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐకి పెరుగుతున్న జనాదరణ



**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లిః** కొత్తగూడెం నియోజకవర్గంలో సిపిఐకి జనాదరణ పెరుగుతుందని, ప్రజలకు అనునిత్యం అందిస్తున్న ఫలితంగానే సిపిఐని ప్రజలు ఆదరిస్తున్నారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. బుధవారం పాల్వంచ పట్టణం, పాలకొయ్యతండా బస్తీకి చెందిన సుమారు వంద కుటుంబాలు కూనంనేని సమక్షంలో సిపిఐలో చేరాయి. ఈ సందర్భంగా కూనంనేని వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించగా, సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్‌పాషా ప్రాథమిక సభ్యత్వాన్ని అందించారు. అనంతరం జరిగిన సమావేశంలో కూనంనేని మాట్లాడుతూ...పార్టీ విస్తరణ, ప్రజా సమస్యల పరిష్కారమే అంతిమ లక్ష్యంగా పార్టీ శ్రేణులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, నూతనంగా పార్టీలో చేరుతున్న నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల నమ్మకానికి, ఆశలకు అనుగుణంగా ప్రతి పల్లెకు మౌళిక వసతులు కల్పించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నానని, అందుకు ప్రజలు సహకారం అందించాలని కోరారు. కాగా పాలకొయ్యతండాకు చెందిన నునావత్ శంకర్, వీరస్వామి, చంటి, సేవాలాల్, శ్రీరామ్, సుశీల, నరసింహ తదితరుల నేతృత్వంలో వంద కుటుంబాలు సిపిఐలో చేరగా కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్‌పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు మత్యాల విశ్వనాథం, జిల్లా సమితి సభ్యులు అడుసుమల్లి సాయిబాబు, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, గెద్దాడు నగేష్, రత్నకుమారి, భూక్యా శ్రీనివాస్, బరిగెల సంపూర్ణ, ఎన్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## విపత్కర పరిస్థితులను ఎదుర్కునేందుకు డిడిఆర్ఎఫ్ బృందం సిద్ధం : ఎస్‌పి



**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** విపత్కర పరిస్థితులను ఎదుర్కునేందుకు జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో డిడిఆర్ఎఫ్ బృంధాలు సిద్ధంగా ఉన్నాయని ఎస్‌పి రోహిత్ రాజ్ తెలిపారు. వార్షాకాలంలో జిల్లాలో నదులు, వాగులు, వంకలు పొంగి విస్తృతంగా ప్రవహించే అవకాశం ఉందని, జిల్లా పోలీస్‌శాఖ తరుపున డిస్ట్రిక్ట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ సిద్ధంగా ఉందన్నారు. గోదావరి నది పరివాహక ప్రాంతాల్లో లోతట్టు ప్రాంతాలుజలమయమైనప్పుడు వెంటనే ఈ బృంధం అక్కడికి చేరుకుని ఆపదలో ఉన్న వారిని కాపాడే విధంగా చర్యలు చేపడతారన్నారు. ఈ సందర్భంగా ఆయన బృంధానికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి పారితోష్ పంకజ్, భద్రాచలం ఏఎస్పి అంకిత్ కుమార్‌సంక్వారితో పాటు పలువురు పాల్గొన్నారు.

# ఎన్‌టిఎను రద్దు చేయాలి



**-నీట్ లీకేజీపై సమగ్ర విచారణ జరిపించాలి**
**-విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి**
**-విద్యార్థి, యువజన సంఘాల నాయకుల డిమాండ్**

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : నీట్ పేపర్ లీకేజీ పై సుప్రీం కోర్టు జడ్జితో సమగ్ర విచారణ జరిపించి బాధ్యులను కఠినంగా శిక్షించాలని ఎన్‌టిఏను తక్షణమే రద్దు చేయాలని విద్యార్థి, యువజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఖమ్మం నగరంలోని గిరిప్రసాద్ భవన్‌లో గల ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి సాయి, ఎన్ఎస్‌యుఐ జిల్లా కార్యదర్శి ఆసిఫ్, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి వెంకటేష్, మస్తాన్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్, పివైఎల్ రాష్ట్ర కమిటీ సభ్యులు మందా సురేష్, పివైఎల్ జిల్లా కార్యదర్శి రమేష్ తదితరులు మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీకి కారణమైన ఎన్‌టిఏ సంస్థను తక్షణమే రద్దు చేసి సుప్రీం కోర్టు జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలన్నారు. నీట్ పేపర్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ దేశ ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా నీట్ పేపర్ లీకేజీ పై విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చేస్తుంటే కనీసం దేశ ప్రధాని కాని, బిజెపి నాయకత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. బిజెపి అధికారంలో ఉన్న బీహార్, గుజరాత్, హర్యానా తదితర రాష్ట్రాలలో పేపర్ లీకేజీ అయిందని ఈ లీకేజీలో బిజెపి నేతల ప్రమేయం ఉందన్నారు. నీట్ పేపర్ లీకేజీ మరువక ముందే దేశ వ్యాప్తంగా నిర్వహించిన యుజిసి, ఎన్‌ఈటి పరీక్షను రద్దు చేస్తున్నట్లు ప్రకటించడం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడటమేనన్నారు. యుజిసి, ఎన్‌ఈటి ని రద్దు చేయడం వెనక నీట్ అవకతవకలను మరిపించడం కోసమేనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయని వారు ఆరోపించారు. కేంద్రం పరీక్షల నిర్వహణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని వారు డిమాండ్ చేశారు. గురువారం జరిగే దేశ వ్యాప్త విద్యా సంస్థల బంద్‌కు విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజలు సహకరించి విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్, ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర సమితి సభ్యులు మధు, మాగం లోకేష్, ఎస్‌ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రాజు, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్, ఏఐవైఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి మద్దోజు శ్రావణ్, డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు చింతల రమేష్, పివైఎల్ జిల్లా అధ్యక్షులు ఉమా శంకర్, వివిధ సంఘాల నాయకులు నాగుల్ మీరా, శివానాయక్, చందులాల్, ప్రతాప్, రాకేష్, రోహిత్, అయ్యప్ప, ప్రభాస్ తదితరులు ఉన్నారు.

## నల్ల చట్టాలను రద్దు చేయాలని రిలే నిరాహార దీక్షలు

ప్రజాపక్షం/ ఖమ్మం లీగల్ : అమల్లోకి వచ్చిన నూతన నల్ల చట్టాలను రద్దు చేయాలని కోరుతూ పలు న్యాయవాద సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఖమ్మం కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నల్ల చట్టాలను రద్దు చేయాలని కోరుతూ న్యాయవాదులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. నూతన నల్ల చట్టాలు ప్రజలు, న్యాయవాదులకు వ్యతిరేకంగా ఉన్నాయని ఈ చట్టాలను వెంటనే రద్దు చేయాలని బార్ కౌన్సిల్ సభ్యులు కొల్లి సత్యనారాయణ డిమాండ్ చేశారు. చింతనిప్పు వెంకట్, పి. అమర్‌చంద్, బిచ్చాల తిరుమలరావు, గొల్లపూడి రామారావు, పొట్లపల్లి విష్ణువ్‌కుమార్, పిడతల రామ్మూర్తి రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో షేక్ లతీఫ్, ఒరుగంటి శేషగిరిరావు, ఏడునూతల శ్రీనివాసరావు, మందడపు శ్రీనివాసరావు, మేకల సుగుణారావు, ఆర్. పావెల్, ఆకుల శేఖర్‌బాబు, కొత్తా వెంకటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, వి. లక్ష్మి నారాయణ, తన్నీరు పాపయ్య, సోడే ధర్మేంద్ర, వల్లాల శ్రీను, భాను, వివిధ లీగల్ సెల్ న్యాయవాదులు, సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వాసుపత్రుల్లో వసతులు కల్పించండి



**సూపరింటెండెంట్‌కు సిపిఐ వినతి**

ప్రజాపక్షం/ ఖమ్మం : వ్యాధుల సీజన్ ప్రారంభమైందని ప్రభుత్వాసుపత్రుల్లో సౌకర్యాలు మెరుగుపర్చాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మహ్మద్ సలాం విజ్ఞప్తి చేశారు. వాతావరణ మార్పుల వల్ల వచ్చే విష జ్వరాలకు సంబంధించి ప్రభుత్వాసుపత్రుల్లో మందులు అందుబాటులో ఉంచడంతో పాటు రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు ఖమ్మం ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సలాం మాట్లాడుతూ గతంలో బెడ్స్ కొరత రోగుల పాలిట శాపంగా మారిందని ఆ పరిస్థితి పునరావృతం కాకుండా చూడాలన్నారు. వైద్య పరీక్షలకు సంబంధించి అన్ని పరీక్షలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరిగేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు పేద, మధ్యతరగతి ప్రజలు వస్తుంటారని వారికి వైద్యం సకాలంలో అందేలా తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో సిపిఐ నాయకులు సాంబశివారెడ్డి, నూనె శశిధర్, జ్వాలా నర్సింహారావు, ముజామిల్, యాకూబ్, రవీందర్ నాయక్, శేఖర్, నాగేశ్వరరావు, ఎండి రెహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.

## వాతావరణ సమతుల్యతకు మొక్కలు నాటండి : జారే

ప్రజాపక్షం/అశ్వారావుపేట : వాతావరణ సమతుల్యత కోసం ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సూచించారు. బుధవారం వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. అటవీశాఖ 75వ వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా అశ్వారావుపేట బీట్‌లోని 293 కాంపార్టుమెంటులో 15 హెక్టార్లలో రూ.10లక్షల వ్యయంతో మరుజాతి మొక్కలు పెంపకం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా కొన్ని చోట్ల పోడు భూముల సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కారం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. అడవులను నాశనం చేయకుండా అటవీశాఖాధికారులకు సహకరించాలన్నారు. అడవులు సంరక్షించినప్పుడు వాతావరణ సమతుల్యత ఉండి వర్షాలు పడి పంటలు సంవృద్ధిగా పండుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ ఎఫ్‌డిఓ కె.దామోదర్‌రెడ్డి, దమ్మపేట, అశ్వారావుపేట రేంజర్లు కరుణకారచారి, మురళీ, తహశీల్దార్ కృష్ణప్రసాద్, ఎంపిడిఓ శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు జూపల్లి రమేష్, మొగళ్ళపు చెన్నాకేశవరావు, జూపల్లి ప్రమోద్, సత్యనారాయణచౌదరి, ఎస్‌కె.పాషా, ఆల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## వేలాన్ని నిరసిస్తూ ఐదున లెఫ్ట్ ఆందోళన

ప్రజాపక్షం/ ఖమ్మం : బొగ్గు బ్లాకుల వేలాన్ని నిరసిస్తూ ఈనెల ఐదున శుక్రవారం వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఖమ్మం కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించనున్నారు. కేంద్ర ప్రభుత్వం సింగరేణిని నిర్వీర్యం చేస్తూ బొగ్గు బావులను ప్రైవేటీకరించే కుట్ర చేస్తుందని ఎట్టి పరిస్థితుల్లోను వేలాన్ని నిలిపివేయాలని సిపిఐ, సిపిఎం, సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శులు పోటు ప్రసాద్, నున్నా నాగేశ్వరరావు, గోకినేపల్లి వెంకటేశ్వరరావు, రాజేంద్ర ప్రసాద్ లు తెలిపారు. మోడీ ప్రభుత్వం దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలన్నింటిని కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టాలని చూస్తుందని ఈ క్రమంలోనే బొగ్గు బ్లాకులను సైతం వేలం వేస్తున్నారని వారు ఆరోపించారు. వేలాన్ని నిరసిస్తూ జులై ఐదు ఉదయం 10 గంటలకు ఖమ్మం కలెక్టరేట్ వద్ద వామపక్ష పార్టీలు, వామపక్ష అనుబంధ కార్మిక సంఘాలు ఆందోళనలు నిర్వహిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు.

## నేడు సిపిఐ కార్యాలయంలో దొడ్డి కొమరయ్య వర్ధంతి



ప్రజాపక్షం/ ఖమ్మం : తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరవీరుడు దొడ్డి కొమరయ్య 78వ వర్ధంతి కార్యక్రమాన్ని సిపిఐ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ నేడొక ప్రకటనలో తెలిపారు. విసునూరు దేశ్‌ముఖ్ దుర్మార్గాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యం చేస్తున్న దొడ్డి కొమరయ్యను హతమార్చారని ఆయన తెలిపారు. దొడ్డి కొమరయ్య మరణించిన ఆయన త్యాగం సాయుధ తెలంగాణ పోరాటానికి ఊపిరి పోసిందన్నారు. 19 ఏళ్ల వయస్సులోనే అమరుడైన దొడ్డి కొమరయ్య వర్ధంతి సందర్భంగా నాటి తరం త్యాగాలను నేటి తరానికి తెలియజేసేందుకు వర్ధంతి కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. వర్ధంతి కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

## అంగన్‌వాడీ కేంద్రాలకు కుర్చీల వితరణ

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఖమ్మం నగరంలోని 46వ డివిజన్ జూబ్లీపురలోని అంగన్‌వాడీ కేంద్రాలకు కుర్చీలు వితరణ చేశారు. బుధవారం కార్పొరేటర్ కన్నం వైష్ణవి పుట్టిన రోజు సందర్భంగా ఏడు అంగన్‌వాడీ కేంద్రాలకు 35 కుర్చీలను వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణీలు, బాలింతల సౌకర్యార్థం కుర్చీలు వితరణ చేసినట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. తమ చిన్నారులను అంగన్ వాడీ కేంద్రాలకు పంపించి ప్రభుత్వం అందించే సౌకర్యాలను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ కవిత, సూపర్‌వైజర్ సత్యశీల, అంగన్‌వాడీ టీచర్లు నాగలక్ష్మి, రమాదేవి, శ్రీలత, శోభ, రేణుక, సంధ్య, మహిళలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.



## కన్నాయిగూడెం భూముల సమస్యను పరిష్కరించండి : సిపిఐ



ప్రజాపక్షం/ అశ్వారావుపేట : కన్నాయిగూడెం రెవెన్యూ భూముల సమస్యను పరిష్కరించాలని సిపిఐ నాయకులు సయ్యద్ సలీం, గన్నిన రామకృష్ణ ఎమ్మెల్యే జారే ఆదినారాయణను కోరారు. బుధవారం అశ్వారావుపేటకు వచ్చిన ఎమ్మెల్యేను వివిధ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందచేశారు. మండలంలోని లంకాలపల్లి, మల్లాయిగూడెంలో పోడు సాగు చేసుకుంటున్న గిరిజనులకు హక్కులు కల్పించాలని, కన్నాయిగూడెం రెవెన్యూలో పట్టా హక్కులు కల్గి కొత్త పాస్‌పుస్తకాలు జారీ కాకుండా ఉన్న సర్వే నెంబర్ 152లోని భూములకు తక్షణమే పాసు పుస్తకాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. గిరిజన రైతులకు ప్రభుత్వ నుండి రైతు భరోసా, బ్యాంక్ రుణ సదుపాయం తదితర సదుపాయాలు కల్పించేందుకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పట్టాదార్ పాస్‌పుస్తకాలు వెంటనే మంజూరు చేయాలని కోరారు.

## ఎస్సై ఆత్మహత్యాయత్నానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోండి



ప్రజాపక్షం/ అశ్వారావుపేట : అశ్వారావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ ఆత్మహత్యాయత్నానికి కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మాదిగ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం అశ్వారావుపేట మండల కేంద్రం రింగ్ రోడ్డు సెంటర్ నందు మాల మహానాడు, ఎమ్మార్పీఎస్ సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అశ్వారావుపేట పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న నిస్వార్థపరుడైన శ్రీరాముల శ్రీనివాస్‌పై ఉన్నతాధికారులతో పాటు నలుగురు కానిస్టేబుళ్ల వేధింపుల వల్ల మానసికంగా కృంగిపోయి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని, దీనికి కారణమైన వారిపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు కన్వీనర్ జక్కుల రాంబాబు, ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి ఏపూరి వెంకటేశ్వరరావు, ఆదివాసం నాయకులు తంబళ్ల రవి, కారం నాగేందర్, వాసం పోలయ్య, అల్లాడి వెంకట రామారావు, గుమ్మళ్ల గోపి, రావూరి వీరయ్య, కాంతారావు పాల్గొన్నారు.

## ప్రైవేటు పనులకు పంచాయతీ ట్రాక్టర్..!




**ప్రజాపక్షం/కొణిజర్ల :** గ్రామపంచాయతీలో ప్రజల నీటి అవసరాలకోసం పంచాయతీ ట్రాక్టర్‌ను వినియోగించాలి . వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో గ్రామాల్లో ఇంకా నీటి ఎద్దడి తలెత్తుతున్న దుర్భర స్థితి నెలకొంది. ఈ క్రమంలో కొణిజర్ల మండలం గుబ్బగుర్తి పంచాయతీకి చెందిన ప్రభుత్వ ట్రాక్టర్‌ను రాంపురం గ్రామంలో ఓ ఇంటి నిర్మాణ నీటి అవసరానికి వినియోగిస్తుండడం విస్మయం కిలిగిస్తోంది. నీటిఎద్దడి నేపథ్యంలో అధికారులు ఇలాంటి ప్రయివేటు సేవలను పక్కనపెడితే మంచిదని ప్రజలు భావిస్తున్నారు.

## ట్రిబుల్ ఐటీకి ఎంపికైన కల్లూరు విద్యార్థి



**ప్రజాపక్షం/కల్లూరు:** తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ప్రతిష్టాత్మకమైన బాసర త్రిబుల్ ఐటీ కి కల్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి కంచు భవిష్ 9.8 సాధించాడు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల కల్లూరులో గత విద్యా సంవత్సరం 10వ తరగతి ఇంగ్లీష్ మీడియం లో చదివి ప్రతిభను చాటి మండలం నుండి బాలురు విభాగం నుండి ఎంపికైన ఏకైక విద్యార్థి కంచు భవిష్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పేద విద్యార్థి. త్రిబుల్ ఐటీ కి ఎంపికైన ఈ పేద విద్యార్థిని ప్రధానోపాధ్యాయులు నివేదితతో పాటు 1977 78 పూర్వ విద్యార్థులు తోపుదు బండి ఫౌండేషన్ సాదిక్ అలి, కల్లూరు పట్టణ ప్రముఖులు ఎంపీపీ రఘు, జెడ్పిటిసి అజయ్ కుమార్ అధికారులు, ప్రజాప్రతినిధులు విద్యార్థినిని హర్షిస్తూ అభినందించారు.

## బదిలీ ఉపాధ్యాయులకు వీడ్కోలు



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరులోని ప్రభు త్వ ఉన్నత పాఠశాలలో గత కొన్ని సంవత్సరాలుగా సేవలందించి బదిలీపై వెళ్లిన ఏడుగురిని బుధవారం పాఠశాల ఉపాధ్యాయులను విద్యార్థులు, సిబ్బంది శాలువాలతో సన్మానించి మెమెంటోలతో సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు చేసిన సేవలను విద్యా బోధనను వారు చెప్పిన మాటలను గుర్తుకు తెచ్చుకుంటూ ఆలకించారు. మీ సేవలో మాకు మీ విద్యాబోధన మాకు, మా మదిలో మా జీవితాలలో ముద్ర వేసినట్లుగా నిలకడగాఉంటాయని విద్యార్థులు వారికి తెలియపరిచారు. గుర్తుకు తెచ్చుకున్నారు. మీరు ఎక్కడున్నా ఏ ప్రాంతంలో ఉన్న మేము ఫోన్ చేస్తామని, మీరు సలహాలు మాకు తెలియజేయండి అంటూ విద్యార్థులు వారికి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నివేదిత తో పాటు ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## ధర్నాకు వెళ్లిన ఆసుపత్రి కార్మికులు




**ప్రజాపక్షం/కల్లూరు:** తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఆధ్వర్యంలో హైదరాబాదులోని డీఎంఈ కార్యాలయం ముందు కనీస వేతనం చట్టం అమలు కోసం కల్లూరు నుండి ఆసుపత్రి కార్మికులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఏఐటియుసి రాష్ట్ర నాయకులు నిమ్మటూరి రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు వేము రాంబాబులు మాట్లాడుతూ జీవో నెంబర్ 60 ప్రకారం ప్రభుత్వ ఆసుపత్రులలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ. 15000 ఇవ్వాలని నిర్ధారించగా పిఎఫ్ ఈఎస్ఐ వాటా పోగా ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 21ని అమలు చేయాలని కార్మికులకు కనీస వేతనం అందేలా తగిన చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్లు, అధికారులు వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు దామాల దయాకర్ రావు, రమాదేవి, మేరీ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ సమైక్యలను మార్చాలి

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని గ్రామాలలో ఉన్న గ్రామ సమైక్యలను, పాలకవర్గమును పూర్తిస్థాయిలో పరిపాలన కాలము మూడు సంవత్సరాలు పూర్తైనందున గ్రామ సమైక్యలో పాలకవర్గమును మార్చి నూతన కమిటీని ఏర్పాటు చేయాలని డిఆర్డిఏ డి ఎం జి జనార్ధన్, వెంకట్రామారావులు వివో ఏ లను కోరారు. 2023 24 ఆర్థిక సంవత్సరానికి గాను తనిఖీలు పూర్తైనందున మహాజనసభ నిర్వహించి గ్రామ సమైక్యలలో వచ్చిన లాభనష్టాలు, ఆదాయ వ్యయాలు, వసూళ్ళు, చెల్లింపులు, బ్యాంకు లింకేజీలు సిఐఎఫ్ శ్రీనిధి లపై వచ్చిన లావాదేవీలను గ్రామ సమైక్య సభ్యులకు తెలియపరచాలని కోరారు. కల్లూరు లోని స్త్రీ శక్తి భవనంలో బుధవారం వివో ఏల సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఏపిఎం డిఎంజి మాట్లాడుతూ గ్రామాలలో లింక్ కేజీ రుణాలు లక్ష్యాలను పూర్తి చేసి బీమా సౌకర్యాన్ని ప్రతి ఒక్కరికి అందించేందుకు వివోఏల అదే బాధ్యతని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్త్రీ నిధి మేనేజర్ వేణుగోపాల్ చారి లతోపాటు కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, వివో ఏలు పాల్గొన్నారు.

# సర్కారు ఉద్యోగికి ఆసరా పెన్షన్..!



**ప్రజాపక్షం / కొణిజర్ల :** వృద్ధులు, వికలాంగులు, మానసిక స్థిమితం లేని అభాగ్యులకు ప్రభుత్వం అందించే ఆర్థిక సాయమే ఆసరా పెన్షన్. ప్రతి నెలా ఠంచనుగా ఈ పింఛను అందుకుని వారి వారి మనుగడ సాగించుకోవడం చూస్తున్నాం. ఇది అందరికీ తెలిసిన విషయమే. మరి ఒక ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న వ్యక్తి 'ఆసరా' పెన్షన్ పొందితే..? అవును మీరు చదివింది నిజమే. ప్రతి నెలా ఒకటో తేదీన సర్కారు వేతనం పొందే ఒక ప్రభుత్వ ఉద్యోగి ఆసరా పెన్షన్ పొందుతున్నాడు. జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉన్న కొణిజర్ల మండలంలోనే ఈ చోద్యం చోటుచేసుకుంటుంది. అంటే ఆ ఉద్యోగి ఎంచక్కా అటు ప్రభుత్వ వేతనం.. ఇటు ఆసరా పెన్షన్ పొందుతూ 'నన్ను అడిగేదెవరురా..?' అంటూ జల్సా చేస్తున్నాడు. వడ్డించేవాడు మనోడైతే చివరి బంతిలో కూర్చున్నా కోరుకున్న ముక్కలు కంచంలో విందు చేస్తాయి. ఇది పాత నానుడి అయినా ఇందులో నిజంగా ఎంతో అర్థం ఇమిడి ఉంది. కొణిజర్ల మండలంలో ఓ శాఖకు ప్రాతినిధ్యం వహిస్తున్న అధికారి గురించే ఇప్పుడు మనం చదివేది. ఆయనో వికలాంగుడు. ఎక్కడికి వెళ్లినా మూడు చక్రాల బండి సాయంతోనే వెళ్లాలి. చూడగానే అయ్యో.! అనిపించేలా కనిపించే ఆ అధికారి ఏకంగా సర్కారునే మోసం చేసి ఎడాపెడా ఇటు నెలసరి వేతనం.. అటు పెన్షన్ పొందుతున్నాడు. వికలాంగుడు కావడంతో ఇతనికి చాలా కాలంగా ప్రభుత్వ పెన్షన్ అందుతుంది. కాగా ఇతనికి 2018లో సర్కారు ఉద్యోగం వచ్చింది. కొణిజర్ల మండలంలోనే తొలి పోస్టింగ్ పొందాడు. ఇక చదువులమ్మకే 'బొడ్డు' కోసి పేరు పెట్టినట్లు ఆయన పుస్తకాల అమ్మ ఒడికే అధికారి అయ్యాడు. ఖమ్మం రూరల్ మండలంలో పుట్టి పెరిగిన ఆయన ఆ 'వెంకటేశ్వరుని' నామ జపంతో నిత్యం కొణిజర్ల మండలానికి విచ్చేస్తూ ఉద్యోగ విధులు నిర్వర్తిస్తున్నాడు.

**-ఎంచక్కా అటు ప్రభుత్వ వేతనం..**
**ఇటు పెన్షన్ సౌకర్యం**
**-ఈ తతాంగం ఐదేళ్లుగా జరుగుతున్నా**
**అధికారులకు తెలియకపోవడం దౌర్భాగ్యం**

### పెన్షన్ తీసుకోవడం నేరం కాదా..?

అంగవైకల్యం కలిగిన ఆయనకు ప్రభుత్వం పెన్షన్ మంజూరు చేసి ప్రతి నెలా ఖాతాలో డబ్బులు వేస్తూ వస్తోంది. అయితే ప్రభుత్వ ఉద్యోగం పొందిన తర్వాత కూడా 'ఆసరా' పెన్షన్ పొందుతున్న తీరే ఇక్కడ విస్మయం కలిగిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం రూ.6 లక్షల కోట్ల అప్పులో కూరుకుపోయి కూడా ఆసరా లబ్దిదారులకు ప్రతి నెలా పెన్షన్ ఆగకుండా ఖాతాలో వేస్తోంది. సర్కారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను చూసి కొందరు పెన్షన్‌దారులు, రిటైర్డ్ అయిన పెన్షన్‌దారులు సైతం తమ నెలసరి పెన్షన్‌ను ప్రభుత్వానికి విరాళంగా ఇస్తున్న సందర్భాలను చూస్తున్నాం. అలాంటిది ఎంచక్కా ప్రభుత్వ అధికారిగా జీతం పొందుతూ కూడా ఆసరా పెన్షన్‌ను సైతం ఎత్తుకుంటున్న ఉద్యోగిని ఇతగాడినే చూస్తున్నాం. ఇతనికి ఉద్యోగం వచ్చి ఐదేళ్లు గడిచిపోయినా ఇంకా పెన్షన్ ఇస్తూనే ఉన్నారంటే మన జిల్లా అధికార యంత్రాంగం పని తీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఖమ్మం రూరల్ మండలంలో ఈ ఉద్యోగి నివాస గ్రామ కార్యదర్శి మురళిని ప్రశ్నిస్తే ఆ పేరు గల వ్యక్తి అసలు ప్రభుత్వ ఉద్యోగి అని తెలియదని చెప్పడం గమనార్హం. పరిశీలన చేసి నిజాన్ని నిగ్గు తేలుస్తామని ఆయన సెలవివ్వడం కొసమెరుపు.

### ఎరువులు వేసే సమయంలో

## పత్తిలో కలుపులేకుండా చూసుకోవాలి

**-మండల వ్యవసాయాధికారి బాలాజీ**



**ప్రజాపక్షం/కొణిజర్ల :** పత్తిచేలో ఎరువులు వేసేటప్పుడు పత్తిపొలంలో కలుపులేకుండా చూసుకోవాలని అప్పుడే ఎరువులు వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి బాలాజీ అన్నారు. బధవారం మండల పరిదిలోని గోపవరంలో రైతులు పొలంలో ఎరువులు వేసే విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు వేరు అభివృద్ధి చెందటానికి భాస్వరం ఎక్కువగా ఉన్న ఎరువులు వేసుకోవాలని తెలిపారు. ఒక ఎకరాకు డిఏపి 25 కిలోలు యూరియా 10 కిలోలు కలిపి వేసుకోవాలని తెలిపారు. ఎరువును మొక్క మొదట్లో కాకుండా మొక్క దగ్గరలో చేతితో మట్టి తీసి మట్టి కింద ఎరువు వేసి మట్టి కప్పాలని అన్నారు. ఇలా చేయడం వలన మొక్క ఎదుగుదలకు ఉపయోగపడతుందని పేర్కొన్నారు. అనంతరం పెద్ద మునగాల పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభ నిర్వహించి వ్యవసాయకాలంలో రైతులు చేయవలసిన పనులు గురించి చెప్పడం జరిగిందని అన్నారు. గ్రామాల్లో కుప్పలు కుప్పలుగా మిర్చి నర్సరీలు పెడుతున్నారని నర్సరీలో నారు పెంచుకోదలిచిన రైతులు విత్తనాలు సొంతంగా కొనుగోలు చేసి దగ్గరుండి విత్తనాలు పెట్టుకోవాలని సూచించారు. పత్తి , పెసర ఈనెల 15 వరకు వేసేకొవచ్చని వివరించారు. ఈకార్యక్రమంలో ఏఈఓ సరిత , రైతులు పాల్గొన్నారు.






తెలంగాణ వైద్య విధాన పరిషత్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల కనీస వేతనాన్ని రూ. 26వేలుగా నిర్ధారించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లో ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం. అనంతరం అధికారులకు డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు.

-ప్రజాపక్షం/ ఖమ్మం


# కల్లబొల్లి మాటలతో అధికారం చేపట్టిన కాంగ్రెస్



**- మోసపోయామని మొత్తుకుంటున్న జనం**
**- హామీలు అమలు కాకుంటే నిలదీస్తాం**
**- ఏడు మండలాలు తెలంగాణాలో కలపాలి**
**- స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి**
**- విలేకరుల సమావేశంలో మాజీ ఎంఎల్ఏ రేగా**

**ప్రజాపక్షం/భద్రాచలం :** పోరాడి సాధించిన తెలంగాణలో అన్ని వనరులు సమకూర్చిన బిఆర్ఎస్ పార్టీ పై తప్పుడు ఆరోపణలు చేస్తూ కల్లబొల్లి మాటలు చెప్పి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, పినపాక మాజీ ఎంఎల్ఏ రేగా కాంతారావు ఆరోపించారు. దుమ్ముగూడెం మండలంలోని గంగోలు గ్రామంలో గల వివిఆర్ ఫంక్షన్ హాల్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేవలం ఆరు నెలల్లోనే ప్రజలు కాంగ్రెస్ చేష్టలకు విసిగిపోయి మోసపోయామని ఆవేదన చెందుతున్నారన్నారు. ఇది ప్రజాపాలన కాదు రాక్షస పాలన అంటున్నారని చెప్పారు. కాంగ్రెస్ హామీలు అమలు చేయకుంటే నిలదిస్తామని, ప్రజలకు మేలు జరిగేంత వరకు కేసిఆర్ నాయకత్వంలో పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. గ్రామస్థాయి నుండి పార్టీని బలోపేతం చేసేందుకు కేసిఆర్ ఆదేశాల మేరకు నియోజకవర్గ స్థాయి సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధికారం చేపట్టిన అనతి కాలంలోనే కాంగ్రెస్ నాయకుల ఆగడాలు మితిమీరి పోతున్నాయని, స్వయంగా ఉప ముఖ్యమంత్రి భట్టి నియోజకవర్గంలో పరిస్థితులు ఇందుకు అద్దం పడుతున్నాయన్నారు. జిల్లాలో ముగ్గురు మంత్రులున్నారని, వారు ఢిల్లీ చుట్టు తిరుగుతూ పైరవీలు చేసుకుంటూ ప్రజలను విస్మరిస్తున్నారని మండిపడ్డారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా స్థానిక గోదావరి జలాలను మళ్లించుకుపోయి ఆయా ప్రాంతాలను కోనసీమగా మారుస్తామని అంటున్నారన్నారు. భద్రాద్రి పవర్ ప్లాంట్ మీద పిడుగు పడిందంటూ తప్పుడు ప్రచారాలు చేసుకుంటూ కాంగ్రెస్ నాయకులు పైచాచిక ఆనందాన్ని పొందుతున్నారని యద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేప్పే మాటలకు చేసే పనులకు సంబంధం లేకుండా ఉందని, ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే తెలంగాణలో మరోపోరాటం మొదలవుతుందన్నారు. ఆంధ్రాలో విలీనమైన ఐదు పంచాయిలనే కాకుండా వలీనమైన మొత్తం ఏడు మండలాలను తిరిగి తెలంగాణలో కలపాలని డిమాండ్ చేశారు. ఈనెల 6వ తేదిన విభజన సమస్యలపై ఏపి సిఎం చంద్రబాబు, తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డిలు సమావేశాన్ని నిర్వహించబోతున్నారని, దీనిని ప్రధాన సమస్యగాభావించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అధికారం లేదని కార్యకర్తలు, నాయకులు ఎవ్వరూ నిరుత్సాహ పడవద్దని, త్వరలో మంచిరోజులు రాబోతున్నాయని తెలిపారు. స్థానిక సంస్థలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలని, ఇందు కోసం పార్టీని వార్డు స్థాయి నుండి గ్రామ స్థాయి, జిల్లా స్థాయి వరకు బలోపేతం చేసేందుకు ప్రతీ ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో సీనియర్ నాయకులు మానె రామకృష్ణ, రావులపల్లి రాంప్రసాద్, గూడా నర్సింహామూర్తి, దొడ్డి తాతారావు, అన్నెం సత్యనారాయణ మూర్తి, గంపా రాంబాబు, పినెల్లి రామకృష్ణారెడ్డి, కణితి రాముడు, తుమ్మలపల్లి ధనేశ్వరరావు, ఎంపిపి రేసు లక్ష్మి ,మాజీ సర్పంచ్ జ్యోతి, ప్రమోద్ కుమార్ తదితరులున్నారు.

# గుట్టుగా గుట్కా దందా..!




**-బూర్గంపాడు మండలంలో జోరుగు విక్రయాలు**
**-అధిక రేట్లకు తెరలేపిన దుకాణదారులు**
**-చూసీచూడనట్టు వదిలేస్తున్న అధికారులు**
**-ప్రాణాలకే ముప్పంటున్న వైద్యులు**

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** బూర్గంపాడు మండలంలో గుట్కా దందా గుట్టుగా కొనసాగిస్తున్నారు. ఒక పక్క రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్, గుట్కాలు సమూలంగా నిర్మూలించేందుకు తగు చర్యలు చేపగుతున్నప్పటికీ మండలంలో మాత్రం గుట్కాలు జోరుగా విక్రయిస్తున్నారు. ప్రభుత్వం నిషేధం విధించడంతో రేట్లు అధికమయ్యాయి. గతంలో 15 రూపాయలకు విక్రయించిన అంబర్ ప్యాకెట్ ఇప్పుడు రూ 30లకు విక్రయిస్తున్నారు. అదే విధంగా విమల్ ప్యాకెట్ రూ 10 నుండి 20 రూపాయలకు, 20 నుండి రూ 40లకు పెంచి విక్రయిస్తుండటం పట్ల పలువురు గుట్కా ప్రియులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఎవరైనా తనిఖీలు చేపడతారనే భయంతో దుకణాదారులు పలువురు ఇండ్లలో, కొంత మంది బాత్రూంలో, మరి కొంత మంది పెంటదిబ్బల్లో సైతం దాచి గుట్టుగా అధిక రేట్లకు అమ్ముతున్నారు...


**చూసీచూడనట్టు వ్యవహరిస్తున్న అధికారులు....**

మండల కేంద్రంతో పాటు, వివిధ గ్రామాల ప్రధాన సెంటర్‌లతో పాటు, గ్రామాలలో గుట్కా విక్రయాలు ఇష్టారాజ్యంగా కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికార యంత్రాంగం మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గుట్కా దందాను అరికట్టడంలో పోలీస్ యంత్రాంగం పూర్తిగా విఫలమవుతున్నారనే ఆరోపణలు వనిపిస్తున్నాయి.

**గుట్కాలతో ప్రాణాలకే ముప్పంటున్న వైద్యులు...**

గుట్కాలు నమిలే వారికి భవిష్యత్తులో అనేక ప్రాణాంతక జబ్బుల బారినపడే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు...గుట్కా నమిలే వారు ప్రాణాంతకరమైన క్యాన్సర్ బారినపడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెబుతున్నారు...

**గుట్కా విక్రయిస్తే చర్యలు తప్పవు :**
**సుమన్, ఎస్ఐ, బూర్గంపాడు.**



రాష్ట్ర ప్రభుత్వం జర్దా, గుట్కా అమ్మకాలను పూర్తిగా నిషేధించిందని, ఎవరైనా నిషేధిత గుట్కా, అంబర్, ఆర్ఆర్ వంటివి విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని బూర్గంపాడు ఎస్ఐ సుమన్ ప్రజాపక్షంతో తెలిపారు. విక్రయదారుల సమాచారం తమకు అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలి

**-అటవీ శాఖ మంత్రి**
**కొండా సురేఖ**



**ప్రజాపక్షం/ఖమ్మం :** సమాజం బాగుండాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలని పచ్చదనం వలన సమాజం బాగుంటుందని అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. బుధవారం మండల పరిధిలోని లంకపల్లి పంచాయతీ లోని గొల్లగుడెం అటవీ పరిధిలో జరిగిన వన మహోత్సవం కార్యక్రమం లో రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగామయి తో కలసి ఆమె పాల్గొన్నారు. ఇప్పటికే వాతావరణం కాలుష్యం అవుతుందని మంత్రి అన్నారు. మొక్కలు పెంపకం ద్వారా పచ్చదనం పెరిగి ఆహ్లాదకరంగా ఉంటుందన్నారు. రెవిన్యూ మంత్రి పొంగులేటి మాట్లాడుతూ మొక్కలు నాటి చేతులు దులుపుకోవద్దని వాటిని పెంచేందుకు శ్రద్ద వహించాలని వాటి సంరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందని అన్నారు. అటవీ ప్రాతం లోని ప్లాంటేషన్ ను మంత్రులు, ఎమ్మెల్యే పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం లో అటవీ శాఖ ప్రత్యేక కార్యదర్శి నదీమ్ మహమ్మద్, సీపీ సునీల్ దత్, సిసియఫ్ భీమా నాయక్, డియఫ్ ఓ విక్రమ్ సిద్దార్ద్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మట్టా దయానంద్, మువ్వా విజయ్ బాబు కార్పొరేషన్ చైర్మన్, అదనపు కలెక్టర్ మధుసూదన్, తహశీల్దార్ ప్రతాప్, ఎంపిడిఓ, సిబ్బంది అరుణ తదితరులు పాల్గొన్నారు.

## ఆ ఐదు పంచాయతీలు తెలంగాణలో కలిపేవిధంగా చూడండి

**- రేవంత్, భట్టికి మాజీ ఎంఎల్ఏ పొదెం వినతి**



**ప్రజాపక్షం/భద్రాచలం :** రాష్ట్రవిభజన సమయంలో భద్రాచలం మండలానికి చెందిన ఐదు పంచాయితీలను ఆంధ్రాలో విలీనం చేశారని, కానీ భద్రాచలం అభివృద్ధి చెందాలంటే ఇప్పుడు ఆ ఐదు పంచాయితీలు ఎంతో కీలకమని, 6వ తేదిన ఏపి సిఎం చంద్రబాబుతో జరిగే భేటీలో ప్రధానంగా చర్చించి తెలంగాణకు వచ్చేలా చూడాలని అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్, భద్రాచలం మాజీ ఎంఎల్ఏ పొదెం వీరయ్య స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు వినతి పత్రాన్ని అందజేశారు. ఇదే విషయంలో గతంలో అనేక ఆందోళనలు జరిగాయని, ఇప్పటికైనా దీనిపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించి ఆ ఐదు పంచాయితీలు తెలంగాణలో కలిసేలా భేటీలో ప్రధాన చర్చ జరపాలని ఆ వినతి పత్రం ద్వారా కోరారు.

## నేడు మోరంపల్లి బంజర సంత పాట

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** నేడు మోరంపల్లిబంజర్ గ్రామ పంచాయితీ నందు సంత పాట నిర్వహించడం జరుగుతుందని మోరంపల్లి బంజర్ గ్రామ పంచాయితీ కార్యదర్శి భవాని అన్నారు. బుధవారం ఆమె మాట్లాడుతూ నేటి ఉదయం 11గంటలకు గ్రామ పంచాయితీ కార్యాలయం నందు డిఎల్‌పివో సుదీప్ అధ్యక్షులుగా, గ్రామ పంచాయితీ ప్రత్యేక అధికారి జములారెడ్డి ఆధ్వర్యంలో బహిరంగ వేలం పాట నిర్వహించడం జరుగుతుందన్నారు. వేలం పాటలో పాల్గొనే వారు గ్రామ పంచాయితీకి ఏవిధమైన బకాయిలు ఉండకూడదన్నారు. పాట కాల పరిమితి ఈనెల 05 నుండి 31 మార్చి 2025 వరకు ఉంటుందన్నారు. పాట సమయంలో రూ 1లక్షల డిపాజిట్ కట్టాలన్నారు.

## ఫిర్యాదు చేస్తే స్పందిస్తాం : ఎంఈఓ

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** బూర్గంపాడు మండలంలో అక్రమంగా పలు ప్రైవేట్ విద్యాసంస్థలు చేస్తున్న దోపిడీపై ప్రజాపక్షంలో ప్రచురితమవుతున్న కథనాలపై మండల విద్యాశాఖాధికారి సమ్మయ్య స్పందించారు. బుధవారం ఆయన ప్రజాపక్షంకు ఫోన్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో విచ్చల విడిగా ఫీజులను వసూళ్లు చేస్తూ, ప్రభుత్వ నియమ నిబంధనలను పాటించని ప్రైవేట్ పాఠశాలలపై ఫిర్యాదు చేయాలని, ఫిర్యాదు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## జిల్లాస్థాయి చిత్రలేఖనంలో ప్రథమ బహుమతి



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** జిల్లా స్థాయిలో చిత్రలేఖనంలో ప్రథమ బహుమతి పల్లవి గెలుపొందడం జరిగిందని స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎండి వాజిద్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం భద్రాద్రి కొత్తగూడెంలో గల సింగరేణి పాఠశాలలో నేషనల్ గ్రీన్ కాప్స్ జిల్లా స్థాయి చిత్రలేఖనంలో పోటీలు నిర్వహించగా పల్లవి ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం 9వ తరగతి చదువుతున్నదని తెలిపారు. దీంతో పల్లవిని ప్రధానోపాధ్యాయులతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

## 6న చలో హైదరాబాద్



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** ఆళ్లపల్లి మండల పరిధిలో గల ఆశ్రమ హైస్కూల్ మర్కోడు నందు జరిగిన సమావేశానికి టిపిటిఎఫ్ మండల ఉపాధ్యక్షులు వై నాగేశ్వరరావు అధ్యక్షతన వహించగా టిపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు జోగ రాంబాబు పాల్గొన్నారు. ఈసందర్భంగా జోగా రాంబాబు మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలని, పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర కమిటి పిలుపులో భాగంగా ఈనెల 6న గిరిజన సంక్షేమ కమిషనర్ హైదరాబాద్ కార్యాలయం ముందు నిరసన ప్రదర్శన నిర్వహించడం జరుగుతుందన్నారు. సుమారు పన్నెండు సంవత్సరాలుగా పదోన్నతలు, ఆరు సంవత్సరాలుగా బదిలీలు, పన్నెండు సంవత్సరాలుగా బదిలీలు, పన్నెండు సంవత్సరాలుగా ప్రత్యక్ష నియామకాలు లేవు. 2013 నుండి 14 సంవత్సరములు కన్వర్ట్ చేయబడిన ఆశ్రమ పాఠశాలలకు నేటికీ పోస్టులు మంజూరీ చేయడం లేదని, పది హేన్ సంవత్సరాలుగా సిఆర్‌టిలు శ్రమ దోపిడికి గురి అవుతున్నారని, వీరిని రెగ్యులరైజ్ చేసే అవకాశం ఉన్నప్పటికీ చేయడం లేదు. ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖ తరువాత ప్రభుత్వ గిరిజన సంక్షేమ రెండవ పెద్ద సెక్టర్‌గా ఉన్నదని, సంక్షేమ రంగంగా పాలకులు చెప్పుకుంటున్న గిరిజన సంక్షేమ శాఖ పట్ల సవతి ప్రేమను ప్రదర్శించడం సరికాదని, ఈ నేపథ్యంలో ఉపాధ్యాయులు ఆందోళన ఉద్యమాలు చేయవలసిన సమయం ఆసన్నమైందన్నారు. మండలం నుండి ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో కదిలి, గిరిజన సంక్షేమ కమిషనర్ హైదరాబాద్ కార్యాలయం ముందు జరుగు నిరసన ప్రదర్శనను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో కొమరం రాంబాబు, జి జోగయ్య, కల్తీ వసంతరావు, వేల్పు రాంబాబు పాల్గొన్నారు.

# రైతు భరోసా రైతుల అభిప్రాయాలను నివేదిస్తాం..




### జిల్లా వ్యవసాయాధికారిణి విజయనిర్మల

**ప్రజాపక్షం–నేలకొండపల్లి :** రైతు భరోసా రైతుల అభిప్రాయాలను ప్రభుత్వం కు నివేదిస్తామని జిల్లా వ్యవసాయాధికారిణి యం.విజయనిర్మల అన్నారు. మండలం లోని నాచేపల్లి, పైనంపల్లి, రాజారాంపేట, మోటాపురం సోసైటీలలో రైతు భరోసా సభ లను నిర్వహించారు. ఈ సభలకు జిల్లా వ్యవసాయాధికారిణి పాల్గొని ప్రసంగించారు. మహాజన సభలో రైతులు చెప్పిన అభిప్రాయాలను క్రోడీకరించి నివేదిక ను అందిస్తామని పేర్కొన్నారు. గురువారం తో జిల్లా లో రైతు భరోసా గ్రామ సభలు ముగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారి అభిప్రాయాలను వివరించారు. రైతులకు ఉపయోగమైనపటికీ పది ఎకరాల లోపు పరిమితం చేయాలని కోరారు. సాగు చేసే భూములకు మాత్రమే ఇవ్వాలని మరి కొంత మంది ఉన్నారు. కౌలు రైతులకు కూడ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులకు సబ్సీడీ పై ఎరువులు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి ఏడీఏ విజయనిర్మల, మండల వ్యవసాయాధికారిణి అరుణకుమారి, ఏఈఓ లు శిరీష, శశి రేఖ, అరవింద్, ఉదయ్‌కిరణ్, సోసైటీ చైర్మన్‌లు, సీఈవోలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తే సహించేది లేదు..




### అధికారుల సమీక్ష సమావేశంలో ఎంఎల్‌ఏ జారే

**ప్రజాపక్షం/చంద్రుగొండ:** మండల పంచాయితీ అధికారులు నిర్లక్ష్య వైఖరి అలంభిస్తే సహించేది లేదని అశ్వారావుపేట నియోజకవర్గ శాసన సభ్యులు జారే ఆదినారాయణ అన్నారు. ఎంపిడివో కార్యాలయంలో బుధవారం మండల అధికారుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత అధికారులపై ఉందన్నారు. గత ఎంఎల్‌ఏల కంటే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. రైతులు సమస్యలు ధరణి పోర్టల్‌లో త్వరితగతిన పూర్తి చేయాలని తహసీల్దార్ స్వర్ణలతను ఆదేశించారు. ప్రతి గ్రామంలో 5 కోట్ల నిధులతో సోలార్ ల్యాంప్ ఏర్పాటు చేయటానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రతి పంచాయితీలు ఎప్పటికప్పుడు సమస్యలను తెలుసుకొని తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని పంచాయితీ సెక్రటరీలను ఆదేశించారు. స్నేహభావంతో అధికారులు పని చేయాలన్నారు. మండల అధికారులు పంచాయితీ కార్యదర్శులు సమయపాలన పాటించాలన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే గుర్తింపు తీసుకువస్తానని అన్నారు. క్రీడా ప్రాంగణానికి ఐదు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని సేకరించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. విద్య వైద్యం మౌళిక వసతుల అభివృద్ధి చేసి తీరుతానన్నారు. ఈసందర్భంగా పంచాయితీల్లో ఉన్న సమస్యలను ఎంఎల్‌ఏ దృష్టికి కార్యదర్శులు తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎంఎల్‌ఏ జారే పరిష్కార మార్గంగా కృషి చేస్తానన్నారు. ఈకార్యక్రమంలో ఎంపిపి బానోత్ పార్వతి, మండల స్పెషల్ ఆఫీసర్ సంజీవరావు, ఎంపిడివో అశోక్, తహసీల్దార్ స్వర్ణలత, ఎంఈవో సత్యనారాయణ, జిల్లాకు ఆప్షన్ సభ్యులు రసూల్ తదితరులు పాల్గొన్నారు.

# అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం...



### - స్థానిక సమరానికి సమాయత్తం కావాలి
### - నియోజకవర్గ స్థాయి సమావేశంలో రేగా

**ప్రజాపక్షం/దుమ్ముగూడెం :** అధికారం లేదని ఎవరూ అధైర్య పడవద్దని, రాజకీయ క్షేత్రంలో గెలుపు ఓటములు సహజమే అని, ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటూ కడుపులో పెట్టుకుని కాపాడుకుంటామని బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, పినపాక మాజీ ఎంఎల్‌ఏ రేగా కాంతారావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని గంగోలు గ్రామంలో గల వివిఆర్ ఫంక్షన్ హాల్లో భద్రాచలం నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం సీనియర్ నాయకులు మానె రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యాతిధిగా విచ్చేసిన రేగా ముందుగా బిఆర్ఎస్ జెండా ఎగురవేశారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ రానున్న స్థానిక ఎన్నికల్లో నియోజకవర్గ వ్యాప్తంగా అధిక సంఖ్యలో ప్రజాప్రతినిధులను ఎన్నిక చేసుకునే విధంగా ప్రతీ ఒక్క కార్యకర్త నడుంబిగించాలన్నారు. ప్రభుత్వం విప్‌గా ఉన్న సమయంలో ఈ ప్రాంతాభివృద్ధికి పాటుపడ్డానని, అందులో భాగంగా పోడుభూముల పట్టాలు, సిసిరోడ్ల నిర్మాణానికి కృషి చేశానన్నారు. ఎవ్వరూ నిరుత్సాహపడాల్సిన అవసరం లేదని, ప్రజల దీవెనలు, పార్టీకి ఎప్పటికీ ఉంటాయని చెప్పారు. కేసిఆర్ నాయకత్వంలో బిఆర్ఎస్ పడిలేచిన కెరటం సత్తా చాటుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేసిఆర్ సాధించిన తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి దేశానికి ఆదర్శంగా ఉందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు అన్ని బద్దాలే అని, కేవలం మహిళలకు బస్సు ఉచితంగా పెట్టి పబ్బంకడుపుకుంటున్నారని మండిపడ్డారు. కేసిఆర్ రైతులకు పెట్టుబడి సాయం సమయానికి వేశారని, కానీ ఈ ప్రభుత్వం నిబంధనల పేరుతో కాలయాపన చేస్తోందని యద్దేవా చేశారు. హామీలు నెరవేర్చకుంటే రాష్ట్రస్థాయిలో పోరాటానికి సిద్ధంగా ఉన్నామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ సందర్భంగా పలువురిని పార్టీలో చేర్చుకున్నారు. ఈ సమావేశంలో నాయకులు రావులపల్లి రాంప్రసాద్, గుడవర్తి నర్సింహమూర్తి, దొడ్డి తాతారావు, అన్నెం సత్యనారాయణ మూర్తి, ఎంపిపి రేసు లక్ష్మి , మాజీ సర్పంచ్ జ్యోతి, గంపా రాంబాబు, పినెల్లి రామకృష్ణారెడ్డి, ప్రమోద్‌కుమార్, ధనేశ్వరరావు, నోముల రామిరెడ్డి, కొత్తూరు సీతారామారావు, తునికి కామేష్, దామెర్ల శ్రీనివాసరావు, పందా రాజు తదితరులు పాల్గొన్నారు.

# అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఆసుపత్రిలో బెడ్లు తగ్గింపు

**ప్రజాపక్షం/ మధిర :** మధిర నియోజకవర్గస్థాయిలోని ప్రధాన కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నందు పడకలు తగ్గించటానికి వైద్యాధికారుల నిర్లక్ష్యమే కారణమని ఎఐటియూసి ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు ఆరోపించారు. మధిర కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నందు పడకల తగ్గింపు విషయమై బుధవారం ఆయన హైద్రాబాద్‌లోని తెలంగాణ వైద్యవిధాన పరిషత్ కమీషనర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యులు వైద్య సదుపాయాలు అందించటంలో నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ఓ వైద్యాధికారి మధిరలోని ప్రైవేట్ హాస్పటల్‌లో వైద్యునిగా పనిచేస్తూ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలందించటంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, గతంలో 30పడకల నుండి 26పడకలకు తగ్గించటమే దీనికి నిదర్శనమన్నారు. సరైన సమయానికి వైద్యులు రాకపోవడంతో ఆసుపత్రికి వచ్చే రోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మధిర కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రోగులకు మెరుగైన వైద్య సేవలందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐటిసి రాష్ట్ర సమితి సభ్యులు నిమ్మటూరి రామకృష్ణ, జిల్లా సమితి సభ్యులు దామాల దయాకర్ పాల్గొన్నారు.



# మంత్రి పొంగులేటి పొలాల్లో తిరుగుతూ...



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండలం నారాయణపురం గ్రా మంలో తన సొంత పొలంలో కలి య తిరుగుతూ పంట పొలాలను సమీక్షించారు. ఎప్పుడు ప్రజలతో మమేకమై ఉంటూ సమీక్షను చేస్తూ అను నిత్యం బిజీగా ఉండే మంత్రి నేడు కల్లూరు మండలం నారాయణపురం స్వగ్రామంలో వ్యవసాయ క్షేత్రంలో వ్యవసాయంపై సమీక్ష చేసుకున్నారు. ఏకంగా లుంగీ కట్టి తన పొలంలో పక్క పొలంలో ఉన్న రైతులతో మాట్లాడి వారి కష్ట సుఖాలను తెలుసుకున్నారు. స్వగ్రామ మహిళలతో ముచ్చటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం లో పరిపాలన ఎలా ఉంది రైతులు పరిస్థితి ఎలా ఉంది అనే విషయంపై ఫోటోలు తీసుకున్నారు. సొంత గ్రామానికి చెందిన రైతులు, ప్రజలు, గ్రామస్తులతో గంటపాటు సమీక్ష చేశారు.

# పెన్ను తలలోకి దిగి చిన్నారి మృతి



**ప్రజాపక్షం/భద్రాచలం :** మంచంపై కూర్చుని రాసుకుంటుండగా ప్రమాదవశాత్తు క్రిందకు పడటంతో చేతిలో ఉన్న పెనున తలలోగుర్చుకుని చికిత్సలు పొందతూ చిన్నారి మృతి చెందిన సంఘటనలో భద్రాచలం పట్టణంలో చోటు చేసుకుంది. స్థానిక సుభాష్ నగర్‌కు చెందిన రియాన్షిక(5) యూకేజీ చదువుతోంది. కాగా సోమవారం ఆమె మంచంపై కూర్చుని హోంవర్క్ చేస్తుండగా బాలిక జారి క్రిందపడింది. చేతిలో ఉన్న పెన్ను ఆమె చెవి భాగం నుండి బలంగా తలలోకి దూసుకెళ్లింది. దీంతో గమనించిన తల్లిదండ్రులు బాలికని వైద్యం నిమిత్తం హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. ప్రధం చికిత్సలు చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించి శస్త్రచికిత్సలు నిర్వహించి పెన్నును తొలగించారు. కాగాఆరోగ్య పరిస్థితి విషమించడంతో బాలిక బుధవారం మృతి చెందింది. అల్లారు ముద్దుగా పెంచుకున్న తమ గారాల పట్టి తిరిగిరాని లోకాలు చేరుకోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. అందరితో కలివిడిగా ఉండే రాయాన్షిక చదువుల్లో సైతం ఎంతో చురుకుగా ఉండేదని కాలనీవాసులు, పాఠశాల సిబ్బంది కంటతడి పెడుతున్నారు.

# పారా లీగల్స్‌ను రెవెన్యూ శాఖలో విలీనం చేయాలి



**ప్రజాపక్షం–నేలకొండపల్లి :** తెలంగాణ రాష్ట్ర సెర్ప్‌లో భూమి విభాగం లో పని చేస్తున్న పారా లీగల్స్ మరియు కమ్యూనిటీ సర్వేయర్స్ ను రెవిన్యూ శాఖ లో విలీనం చేయాలని సంఘం అసోసియేషన్ రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దపాక వెంకటేశ్వరరావు కోరారు. బుధవారం డిప్యూటీ కలెక్టర్ ను కలిసి వినతి పత్రం ను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు..2006 నుంచి పేదల భూమి సమస్యల పై పని చేస్తున్న తమను శాఖ లో విలీనం చేయటం వలన సమస్యలు చాలా వరకు పరిష్కారం అవుతాయని అన్నారు. భూ సమస్యల పై అనుభవం ఉన్న పారా లీగల్స్ ను వెంటనే విలీనం చేసి విధులలోకి తీసుకోవాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకొస్తున్న రెవిన్యూ నూతన చట్టం వ్యవస్థలోకి తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు శంకరయ్య, నరసింహా, మహేష్, సాయిలు, శ్రీను, నిర్మల, ముత్తయ్య పాల్గొన్నారు.

# ఆధార్ సెంటర్లు ప్రారంభించాలి



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు మండలంలో ఆధార్ కేంద్రాలు లేక ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సామాజిక కార్యకర్త కర్నె రవి తెలిపారు. విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పెన్షన్ దారులు, రైతులు, సామాన్య ప్రజానీకం మండలంలో ఉన్న ఒకే ఒక ఆధార్ సెంటర్ నాలుగు నెలల నుంచి మూసి వేయడం జరిగిందని, ఆధార్ సెంటర్ లేక అశ్వాపురం, పినపాక మండలాలు చుట్టూ తిరగలేక సతమవుతున్నారని, ఈ విషయమై చొరవ చూపి తక్షణమే మీ సేవ కేంద్రాలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన బుధవారం మణుగూరు తహశీల్దార్ రాఘవరెడ్డికి వినతి పత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన తహశీల్దార్ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

# మా నాన్న చనిపోయాక వచ్చారా..



**-మాకు న్యాయం చేయండి..**
**- తహశీల్దార్ కాళ్ళపై పడిన పిల్లలు**

ప్రజాపక్షం/ చింతకాని : మా నాన్న ఆత్మహత్య చేసుకుని మృతి చెందాక భూమిని పరిశీలించేందుకు వచ్చారా... ఇప్పుడు మాకు మీరే న్యాయం చేయండి అంటూ.. బోజెడ్ల ప్రభాకర్ పిల్లలు చింతకాని తహశీల్దార్ కాళ్ళపై పడి వేడుకోవడం పలువురికి కంటతడి పెట్టించింది. ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన పొద్దుటూరు గ్రామానికి చెందిన బోజెడ్ల ప్రభాకర్‌కు చెందిన వివాదాస్పద భూమిని పరిశీలించేందుకు తహశీల్దార్ రమేష్ సిబ్బందితో పాటు బుధవారం వచ్చారు. సమాచారం తెలుసుకున్న మృతుని కుటుంబసభ్యులు తిరిగి వెళ్తున్న తహశీల్దార్‌ను అడ్డుకున్నారు. తాము ఫిర్యాదు చేసిన వెంటనే స్పందిస్తే మా నాన్న బ్రతికి ఉండే వారని తహశీల్దార్‌ను ప్రశ్నించారు. ఎన్నో ఏళ్లుగా తాము సాగు చేసుకుంటున్న భూమిని నాశనం చేశారని, తమ పొలానికి దారి లేకుండా చేశారని, ఎన్నిసార్లు మీకు మొర పెట్టుకున్న మీరు కనీసం స్పందించారా తిరిగి మా నాన్నను మీరు తీసుకు వస్తారా అంటూ ఆ చిన్నారులు ప్రభాకర్ తండ్రి రోధించారు. తమకు న్యాయం మీరే చేయండి అంటూ మృతుని కొడుకు, కూతురు తహశీల్దార్ కాళ్ళపై పడి బ్రతిమాలారు. న్యాయం చేస్తామని హామీ ఇవ్వాల్సిందిగా పట్టుబట్టారు. ఈలోపు అక్కడికి చేరుకున్న ఎస్సై వానికి నచ్చచెప్పి తహశీల్దార్‌ను కారులో ఎక్కించి అక్కడి నుండి పంపించే ప్రయత్నం చేశారు. కారుకు అడ్డంగా నిలబడి తమకు న్యాయం చేస్తామని మాటిచ్చే వరకు ఇక్కడి నుండి కదలమని భీష్మించుకుని కూర్చున్నారు. సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని తహశీల్దార్ చెప్పడంతో మృతుని కుటుంబసభ్యులు, బంధువులు శాంతించారు.

## ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి రూ.25లక్షలు నష్టపరిహారం ఇవ్వాలి



ప్రజాపక్షం/ చింతకాని : ఆత్మహత్య చేసుకున్న రైతు బోజెడ్ల ప్రభాకర్ కుటుంబానికి ప్రభుత్వం రూ.25లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావుతో కలిసి పొద్దుటూరు గ్రామంలో ప్రభాకర్ నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా లింగాల మాట్లాడుతూ దోషులను కఠినంగా శిక్షించాలని ప్రభాకర్ సాగు చేసుకున్న భూమికి పట్టాదారు పుస్తకం ఆధారంగా భూమి ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభాకర్ భూమిని ధ్వంసం చేసిన వారిపై చర్య తీసుకోవాలని, సమస్యను దరఖాస్తు చేసుకున్నా స్పందించని అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభాకర్ కుటుంబసభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. తాము అండగా ఉంటామనిభరోసా కల్పించారు. అనంతరం వివాదాస్పద పరిస్థితిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షులు పెంట్యాల పుల్లయ్య, కార్యదర్శి బొడ్డు వెంకటరామారావు, వైస్ ఎంపిపి గురజాల హన్మంతరావు, మాజీ ఎంపిటిసి పొనుగోటి రత్నాకర్, వేముల నరసయ్య, పిన్నెల్లి శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ అచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణిని పరిరక్షించుకుందాం..





**సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్**

ప్రజాపక్షం/మణుగూరు: తెలంగాణ రాష్ట్రానికి ఆర్థికంగా పారిశ్రామికంగా సింగరేణి సంస్థ వెన్నుముకల నిలబడుతుందని, ఈ సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని కార్మికులతో పాటు రాజకీయ నాయకులు ఐక్యంగా కలిసి సమస్త మనుగడను కాపాడాలని సింగరేణి కాంగ్రెస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ మనుగడకు అడ్డంకులు ఉన్న చట్టాలను సవరించవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రభుత్వ పాలకుల విధానాల వల్ల సింగరేణి సంస్థ లాభాలను రాష్ట్ర ప్రభుత్వ వాడుకోవడంతో సమస్త అనేక ఆర్థిక ఇబ్బందుల్లో ఉందన్నారు. ఒక పక్క కేంద్ర ప్రభుత్వం 120 మిలియన్ల బొగ్గు ఉత్పత్తి చేయాలని చెబుతూనే ఉన్న బ్లాక్ లను ప్రవేట్ పరం చేయటం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. వేలం పాట నిర్వహిస్తున్నామని, 60 బ్లాకులు లో 59 బ్లాకుల్లో ఇతర రాష్ట్రాల్లో ఉండగా మందమరి బ్లాక్ మాత్రం సింగరేణి పరిధిలో ఉందని ఈ బ్లాక్ ను సింగరేణి సంస్థకు అప్పగించడానికి అన్ని విధాల అవశ్యకత ఉందని కేంద్ర ప్రభుత్వం సానుకూలత ప్రదర్శించి సింగరేణి సంస్థకు ఈ బ్లాక్‌ను అప్పగిస్తే సింగరేణి సంస్థ మనుగడ ఇంకొక 30 సంవత్సరాలు పెరుగుతుందన్నారు. మణుగూరు విషయానికొస్తే ఇంకొక ఐదు సంవత్సరాల వరకే గనులకు భూమి కేటాయించడం జరిగిందని ఐదు సంవ

కంగా మారుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సింగరేణి సంస్థ తన్ను బొగ్గును 3,500 రూపాయలకు విక్రయిస్తుంది కానీ అదే ఆదాని కంపెనీ తన్ను బొగ్గును 19 వేల రూపాయలకు విక్రయిస్తుందని, ఇక్కడి బ్లాక్ లను ప్రైవేటు పరం చేస్తే వాళ్లు కూడా టన్ను 19000 విక్రయిస్తే దీని ప్రభావం ప్రజా జీవనంపై పడుతుందన్నారు. పెట్రోల్, కరెంట్, నిత్యవసర సరుకులు ధరలు ఆకాశాన్ని అంటుతాయని ఇది సింగరేణి సమస్య కాదు ప్రజా సమస్యని కూడా ఆయన అన్నారు. ఇటువంటి తరుణంలో సింగరేణి సంస్థను కాపాడుకోవడానికి కార్మిక కార్మికులతో పాటు రాజకీయ నాయకులు ప్రజాసంఘాలు అన్ని ముందుకు రావాలని ఐక్య పోరాటాల ద్వారానే సంస్థను కూడా సాధించగలుగుతామని అందుకోసం మందమర్రి బ్లాక్ కాపాడుకోవడం కోసం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ దశలవారీ పోరాటాలను ప్రారంభిస్తుందని ఆయన తెలిపారు. ఈ నెల 5వ తేదీ నుండి పోరాటంలో ప్రారంభిస్తుందని మొదటిగా సింగరేణి ప్రాంతంలో ఉన్న అన్ని కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని అదే విధంగా 8, 9 తేదీలలో అన్ని జనరల్ మేనేజర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమం కోసం కార్మిక పిలుపునిచ్చామని పదవ తేదీన హైదరాబాద్ నగరంలోని వేలంపాట నిర్వహించే ప్రాంతంలో మహా ధర్నాకు ప్రయత్నం చేస్తున్నామని ఇందుకు అన్ని కార్మిక సంఘాలు రాజకీయ నాయకులు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయోధ్య, మిర్యాల రంగయ్య, వై. రాంగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## బొగ్గు బ్లాక్‌ల వేలాన్ని రద్దు చేయండి

**-5 నుండి 18 వరకు దశలవారీ ఆందోళనలు**
**-ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు**



ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి: బుధవారం కొత్తగూడెంలోని శేషగిరి భవన్ నందు జరిగిన ఏఐటియుసి జిల్లా ఆఫీస్ బ్యారర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రకృతి ప్రసాదించిన సహజ వనరులు ప్రతి పౌరుడికి దక్కాలని, ఈ భూమి మీద వ్యక్తులకు హక్కు కాకుండా ప్రభుత్వానికి హక్కు ఉండాలని, అనేక ఏళ్లుగా పోరాడి సాధించుకున్న ప్రభుత్వ రంగ సంస్థలను మోడీ ప్రభుత్వం ఆదాని, అంబానిలకు ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకుంటున్న ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు, కార్మికులు, ఉద్యోగులు సంఘటితంగా పోరాటాలు చేయాలని ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సింగ్ నర్సింహారావు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు కంచర్ల జమలయ్య, జిల్లా కార్యదర్శి నరాటి ప్రసాద్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ గెద్దాడ నగేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు, కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బాధితునికి ఆర్థికసాయం



ప్రజాపక్షం/కారేపల్లి: లారీ యాక్సిడెంట్‌లో తీవ్ర గాయాలై ప్రాణాలతో పోరాడుతున్న బాధితుడు రామగిరి సంపత్ గౌసుద్దీన్ రూ.10వేలు ఆర్థిక సాయంగా అందజేశారు. కొన్ని రోజుల క్రితం లారీ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై ఖమ్మంలోని మమత హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న రామగిరి సంపత్‌ను బుధవారం బిఆర్‌ఎస్ పార్టీ జిల్లా మైనారిటీ నాయకులు గౌసుద్దీన్ పరామర్శించారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10వేలు అందజేసి ఆ కుటుంబానికి అండగా నిలిచారు. కుటుంబ సభ్యులను ఓదార్చి సంపత్ త్వరగా కోల్కోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏ.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## భక్తరామదాసు కళాక్షేత్రంలో జరిగే సదస్సును జయప్రదం చేయండి



ప్రజాపక్షం/కారేపల్లి: సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రెండు పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా తెలంగాణ సాయుధ పోరాట విప్లవ వీరుడు తొలి అమరుడు నాజిలను మించిన నరహంతక నైజాం సర్కార్ భూస్వాముల గుండాల కాల్పులకు తన గుండెను ఎదురొడ్డి సాయుధ విప్లవ పోరాట పంద ద్వారానే భూమి సమస్య పరిష్కారం అవుతుందని ప్రాణాలను పెంచిన కామ్రేడ్ దొడ్డి కొమరయ్య 78వ వర్ధంతి రేపు ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో జరుగు సదస్సును జయప్రదం చేయాలని కారేపల్లి మండల జవాన్లు వెళ్లి గ్రామంలో పోస్టర్ ఆవిష్కరణ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి వై.ప్రకాష్, కె.శ్రీనివాస రెడ్డి, ఆలయం గురవయ్య, చంద్రయ్య, బాటయ్య, పెద్ద చంద్రయ్య, నారాయణ, డి.వెంకన్న, పండు, డి.లక్ష్మీ, బుచ్చమ్మ, ఎర్రయ్య, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## దారిలోనే ప్రసవం

**- పురుడుపోసి ప్రాణాలు కాపాడిన 108 సిబ్బంది**



ప్రజాపక్షం/చర్ల : ప్రసవ వేదనతో బాధపడుతున్న మహిళను స్ట్రక్చర్‌పై మోసుకొస్తుండగా మార్గమధ్యలో నొప్పులు ఎక్కువ కావడంతో 108 సిబ్బంది చాకచక్యంగా పురుడు పోసి ప్రాణాపాయం నుండి కాపాడారు. ఈ ఘటనలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నారాయణ పూర్ జిల్లాలో బుధవారం చోటు చేసుకుంది. దట్టమైన అబూజ్‌మడ్ ప్రాంతంలోని ఓర్చాబ్లాక్ పరిధిలోని మండలి గ్రామంలో సోమారి అనే మహిళకు నెలలు నిండి పురిటి నొప్పులు వచ్చాయి. కాగా ఆ ఊరికి రహదారి సౌకర్యం సైతం లేకపోవడంతో మూడు కిలోమీటర్ల దూరం వరకు అంబులెన్స్ వచ్చి ఆగింది. కాగా ఆగ్రామస్తులు ప్రసవ వేదన పడుతున్న ఆమహిళను స్ట్రక్చర్ సహాయంతో 108 సిబ్బందితో కలిసి మోసుకుని వెళుతుండగా మార్గమధ్యలోనొప్పులు అధికం కావడంతో మార్గమధ్యలోనే ఆపి ఆమహిళకు 108 సిబ్బంది పురుడుపోశారు. తల్లిబిడ్డ క్షేమంగా ఉన్నారు. ఇందుకు సహకరించిన 108 సిబ్బంది పైలెట్ రాజేష్, ఇఎంటి కమల సేవలను పలువురు అభినందించారు.

# సీతారామ ప్రాజెక్టుపై మంత్రి తుమ్మల దృష్టి



**-పనుల వేగవంతం కోసం చర్యలు**
**-గ్యాస్ పైప్‌లైన్ క్రాసింగ్**
**-చైనా సాంకేతిక నిపుణుల వీసాల కోసం మంత్రి తుమ్మల చొరవ**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** సీతారామ ప్రాజెక్టు నిర్మాణం పై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టి సారించారు. నిర్మాణ పనుల వేగ వంతం కోసం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పలు కీలక సంప్రదింపులు చేపట్టారు. గ్యాస్‌పైప్ లైన్ క్రాసింగ్, చైనా సాంకేతిక నిపుణుల వీసాల కోసం మంత్రి చర్యలు చేపట్టారు. లింక్ కెనాల్‌కు గుజరాత్ గ్యాస్ పైప్‌లైన్ క్రాసింగ్‌కు సంబంధించి తెలంగాణ చీఫ్ సెక్రటరీ శాంతికుమారికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వివరాలు అందించగా గుజరాత్ చీఫ్ సెక్రటరీతో సిఎస్ శాంతికుమారి ఫోన్‌లో మాట్లాడి గ్యాస్ పైప్‌లైన్ క్రాసింగ్‌కు అనుమతి కోసం తాడేపల్లి గూడెంలో గల పైప్‌లైన్ జిఎంకు ఆదేశాలు ఇవ్వాలని సిఎస్ శాంతి కుమారి కోరారు. అదేవిధంగా ఏపి సిఎస్ తో పైప్‌లైన్ క్రాసింగ్ సమస్యలపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఫోన్‌లో మాట్లాడారు. సీతారామ ప్రాజెక్టుకు సంబంధించి మూడు పంపు హౌజ్ నిర్మాణాలు పూర్తయ్యాయి. అందులో బిజి కొత్తూరు వద్ద గల మొదటి పంపు హౌజ్‌కు జూన్ 27న ట్రయల్ రన్‌ను నిర్వహించారు. వికె రామవరం వద్ద గల రెండవ పంపు హౌజ్‌కు జూలై 15న, కమలాపురం వద్ద గల మూడవ పంపు హౌజ్‌కు జూలై 20 తారీఖున ట్రయల్ రన్ నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. అదేవిధంగా జూలై 30న సీతారామ ప్రాజెక్టు మెయిన్ కెనాల్ పనులు మొత్తం పూర్తి చేసి ఏన్కూరు కెనాల్ ద్వారా సాగునీటిని సరఫరా చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన పనులు చేపడుతున్నారు. ఏన్కూరు కెనాల్ కు సంబంధించి గ్యాస్ పైప్‌లైన్ కాలువ నిర్మాణానికి అడ్డుగా ఉండడంతో దాని క్రాసింగ్ పనులు త్వరితగతిన చేపట్టేలా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చర్యలు చేపట్టారు. లిఫ్ట్ మెటార్ల సాంకేతిక నిపుణులు చైనా దేశం నుంచి రావాల్సి ఉండగా వారి వీసా సమస్యలపై ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఇరిగేషన్ సెక్రటరీ రాహుల్ బొజ్జా దృష్టికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీసుకెళ్లారు. ఆగష్టు నాటికి వైరా లింక్ కెనాల్ పనులు పూర్తి చేసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేసేలా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిరంతరం పనులు పర్యవేక్షిస్తున్నారు. నీటిపారుదల శాఖ సలహాదారుగా ఉన్న కె. పెంటారెడ్డి పదవి కాలం పొడిగించాలని ఇరిగేషన్ శాఖ మంత్రి, కార్యదర్శి దృష్టికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీసుకెళ్లారు. మంత్రి తుమ్మల సూచన మేరకు పెంటారెడ్డి పదవి కాలాన్ని ప్రభుత్వం పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

# వైరాలో జోరుగా జీరో వ్యాపారం..!

**-భవనం ట్యాక్స్ రెసిడెన్షియల్...వ్యాపారం కమర్షియల్**
**-అధికంగా అనుమతులు లేని వ్యాపారాలు**






**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలో అనుమతులు లేకుండా జోరుగా వ్యాపారం కొనసాగుతుంది. కొంతమంది వ్యాపారాలు అనుమతులు ఉండి రెసిడెన్షియల్ భవనంలో కమర్షియల్ వ్యాపారం జోరుగా చేస్తున్నారు. మున్సిపాలిటీకి ఆదాయం గండి కొడుతుంది. వాస్తవంగా మున్సిపాలిటీలో ఏదైనా వ్యాపార నిర్వహణ చేసేటప్పుడు ఆ వ్యాపార నిర్వాహకులు మున్సిపాలిటీ నుండి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి. అనుమతి తీసుకున్న తర్వాత ట్రేడ్ లైసెన్స్ రూపంలో దానికి ఫీజు చెల్లించాలి. ఇది కొంతమంది వ్యాపారులు మాత్రమే చేస్తున్నారు. మరి కొంతమంది రెసిడెన్షియల్‌లో కమర్షియల్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. ఆ రెసిడెన్షియల్ భవనాలు ఇప్పుడు కమర్షియల్ అనుకోవాలా రెసిడెన్షియల్ అనుకోవాలి, ఎందుకంటే కమర్షియల్ ట్యాక్స్ వేయాలని మున్సిపాల్ చట్టం చెబుతుంది. కాని ఆ మున్సిపాల్ చట్టాన్ని కొందరికి చుట్టం లెక్కే చేసుకొని తప్పుడు మార్గంలో వ్యాపార నిర్వహణ కొనసాగుతున్నాయి. వైరా మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్‌లో శ్రీహనుమాన్ ట్రేడర్స్ పేరుతో రెసిడెన్షియల్ భవనంలో వ్యాపార నిర్వహణ నిర్వహిస్తున్నారు. రెసిడెన్షియల్ భవనాన్ని గౌడాన్‌గా ఉపయోగించుకుంటూ పలు రకాల సబ్బులు జిల్లాలో కొన్ని మండలాలకు డిస్ట్రిబ్యూషన్ చేస్తున్నారు. అంటే ఆ భవనంలో శ్రీహనుమాన్ ట్రేడర్స్ నిర్వాహకులు ఎలాంటి మున్సిపాలిటీ అనుమతులు లేకుండా కమర్షియల్ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. మున్సిపాలిటీని ఆదాయానికి గండి కొట్టడం, మున్సిపాలిటీని మోసం చేశారని చెప్పవచ్చును. వైరా మున్సిపాలిటీలో పలు ప్రాంతాల్లో కమర్షియల్ భవనాల్లో ఎలాంటి ట్యాక్స్ లేకుండా గుట్టుచప్పుడు కాకుండా జీరో వ్యాపారాన్ని జోరుగా కొనసాగిస్తున్నారు. మున్సిపాల్ అధికారులు రెసిడెన్షియల్ భవనాల్లో కమర్షియల్ వ్యాపారం చేస్తున్న నిర్వాహకులపై చర్యలు తీసుకొని అదేవిధంగాఎలాంటి అనుమతులు లేకుండా జీరో వ్యాపారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకొని మున్సిపాలిటీ ఆదాయాన్ని పెంచేందుకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# వైరా సమీకృత మార్కెట్ కలగానే మిగిలిపోతుందా..!?



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ ఐదో వార్డులో అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం పాత కూరగాయల మార్కెట్ తొలగించి సమీకృత వెన్ నాన్‌వెజ్ మార్కెట్ 100 గదులతో నిర్మాణానికి రూ.4.50కోట్ల నిధులు కేటాయించింది. దీంతో ఎప్పటి నుంచో ఉన్న పాత కూరగాయల మార్కెట్‌ని తొలగించి రోడ్డు ప్రక్కన నూతన సమీకృత మార్కెట్‌ను ఏర్పాటు చేసేందుకు పనులు ప్రారంభించారు. కాని ఆ పనులు పూర్తికాకుండా అసంపూర్తిగా ఆగిపోవడం జరిగింది. కూరగాయల నిర్వాహకులు పలుసార్లు ప్రజాప్రతినిధులను అధికారులను కలిసి మా గోడు పట్టించుకోరా అని అడిగారు. తర్వాత రాష్ట్రంలో జరిగిన శాసన సభ ఎన్నికల అనంతరం కాంగ్రేస్ ప్రభుత్వం అధికారం చేపట్టింది. ఇప్పుడు ఆ సమీకృత వెజ్ నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోవడం కాకుండా అసలు నిర్మాణం పనులు జరగవని వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. ఆ సమీకృత మార్కెట్ నిర్మాణం ఇతర అవసరాలకు వినియోగించుకోనున్నట్లు సమాచారం. దీంతో ఎన్నో కలలతో ఎదురుచూసిన కూరగాయల చిరు వ్యాపారుల కలలు ఫలించే పరిస్థితి కనిపించడం లేదు. అయితే ప్రస్తుతం హరితభవన్‌లో ఉన్న చిరు వ్యాపారుల కూరగాయల నిర్వాహణను అక్కడే కొనసాగిస్తారా లేదా మరెక్కడైనా నిర్మాణం చేపడతారా అనేది కూడా ఇప్పుడు జోరుగా చర్చ నడుస్తుంది. ఏది ఏమైనప్పటికి వైరా మున్సిపాలిటీ పరిధిలో ఐదో వార్డులో చేపట్టిన సమీకృత మార్కెట్ నిర్మాణం ఇక పూర్తికాదేని ప్రచారం జోరుగా కొనసాగుతుంది.

# ఆశ్రమ పాఠశాల ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/ములకలపల్లి:** గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాల, వసతి గృహలలో చదువుతున్న విద్యార్థులకు మెనూ ప్రకారం పుష్టికరమైన ఆహారముతో పాటు విద్య, వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి బి రాహుల్ అన్నారు. బుధవారం ములకలపల్లి మండలంలోని గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని డార్మెటరీ బ్లాక్ కిచెన్ షెడ్డు కూరగాయాలు పరిశీలించి, పాఠశాల లోపల బయట, పాఠశాల నిర్వహణ సరిగా లేక అపరిశుభ్రంగా ఉండటంతో హెచ్‌ఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు వడ్డిస్తున్న ఆహారాన్ని ఆయన పరిశీలించి, మెనూ ప్రకారం ప్రతి రోజు భోజనం పెడుతున్నది లేనిది విద్యార్థులను అడిగి తెలుసుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవి సెలవులకు ఇండ్లకు వెళ్లి తిరిగి పాఠశాలల్లో చేరిన విద్యార్థుల పట్ల ప్రధానోపాధ్యాయులు, వార్డెన్లు వారి యొక్క ఆరోగ్య స్థితి గతులను గమనిస్తూ ఉండాలని, వాతావరణం, స్థలం మార్పు వలన పిల్లల యొక్క ఆరోగ్యములో మార్పులు సంభవిస్తాయని గమనిస్తూ ఉండాలని, ఎవరైనా పిల్లలు అస్వస్థతకు గురి అయితే వెంటనే వైద్య పరీక్షలు చేయించాలన్నారు. పాఠశాలలో ముఖ్యంగా విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా టాయిలెట్, మంచినీరు, బాత్రూమ్స్, కరెంట్ ట్యూబ్ లైట్లు, ఫ్యాన్లు తప్పని సరిగా ఉండాలని తెలిపారు. వర్షాకాలం నడుస్తున్నందున పిల్లలు రాత్రిపూట బయటకు రాకుండా చూడాలని, విషపూరితమైన క్రిమి, కీటకాలు, పాములు, తేళ్లు సంచరిస్తూ ఉంటాయని సంబంధిత సిబ్బంది ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి తరగతి గదిలో ఉపాధ్యాయులు బోధిస్తున్న బోధన తీరును పరిశీలించి, సబ్జెక్ట్ టీచర్లు బోధిస్తున్న పాఠాలు అర్థమవుతున్నది లేనిది విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమ పాఠశాలలో పని చేసే హెచ్‌ఎంలు, వార్డెన్లు, సబ్జెక్ట్ టీచర్లు పని చేసే సిబ్బంది అందరూ స్థానికంగా ఉండాలని స్థానికత పాటించని సబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు హిందీ, ఇంగ్లీష్ సబ్జెక్టులలో నైపుణ్యత సరిగా లేదని పిల్లలకు అర్థమయ్యే రీతిలో సబ్జెక్ట్ టీచర్లు విద్యాబోధన చేయాలన్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వరరావు, వార్డెన్ వీరభద్రం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి సమీక్షా సమావేశాలు



**ప్రజాపక్షం/గుండాల :** మండలంలోని శెట్టిపల్లి, శెంభునిగూడెం పంచాయితీలలో బుధవారం పినపాక నియోజకవర్గ శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు అన్నిశాఖల అధికారులతో కూడి సమావేశం నిర్వహించారు. పంచాయితీల ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని అట్టి సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు ఈ సమావేశాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ముఖ్యంగా ఇల్లందునుండి ఆర్టీసి బస్సు సౌకర్యం కల్పించాలని రెండు పంచాయితీల ప్రజలు ఎమ్మెల్యేను కోరగా ఆర్టీసి డిఎంతో మాట్లాటి రెండురోజుల్లో బస్సు సౌకర్యం కల్పిస్తామని హామి ఇచ్చారు. ప్రజల వినతులను స్వీకరించి అట్టి సమస్యలను ఈయా శాఖల అధికారులు పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు కె ముత్యం చారి, పొంబోయిన ముత్తయ్య, ఎంపిటిసి క్రిష్ణారావు, దార అశోక్, పూనెం సమ్మయ్య, శంకర్, బుచ్చయ్య, ఇస్రార్, రాజేష్, బొంగు చంద్రశేఖర్, మండలోజుకిరన్, ఎస్కె ఖదీర్ పాల్గొన్నారు. ఇటీవల అనారోగ్యంతో బాదపడుతున్న మండల కేంద్రానికి చెందిన ఎస్కె జిలాని బేగం , మండలోజు సత్యంలను వారి స్వగృహాలకు వెళ్లి పరామర్శించారు.

# ఘర్వాపస్...గాయత్రి హోమం



**ప్రజాపక్షం/ములకలపల్లి:** ములకలపల్లి మండలంలోని రామాంనేయపురం గ్రామం లో స్థానిక ఆంజనేయస్వామి దేవాలయం లో బుధవారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో గాయత్రి హోమం జరిపించారు. గ్రా మంలో ఉన్నటువంటి హిందువులు అంతా కూడా హిందూ సాంప్రదాయం బద్ధంగా ఈ యొక్క కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ భాగ్యనగర్ క్షేత్ర సంఘటన కార్యదర్శి, గుమ్మల్ల సత్యం, గణపురం రాజేశ్వర్‌రెడ్డి ప్రాంత సహ కార్యదర్శి...ప్రాంతం మందిర్ అర్చక పురోహితులు సహ ప్రముఖ్ ఓరుగంటి సురేష్, మండల స్థానిక అర్చకులు ముకుందల సత్యనారాయణ శాస్త్రి హోమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో భాగంగా విభాగ్ సంఘటన కార్యదర్శి గడిదేసి వెంకటేశ్వర్లు, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు చిలుకూరు నాగేశ్వరరావు, కార్యదర్శి గంగాధర్ సీత, విశ్వహిందూ పరిషత్ ప్రఖండ అధ్యక్షులు కారంపూడి సత్యనారాయణ రాజు, ఉపాధ్యక్షులు పువాల శ్రీను, మాజీ జెడ్‌పిటిసి బత్తుల అంజి, ఎంపిటిసి సెనగపాటి మోహార మణి, ఎంపిపి మట్ల నాగమణి, జిల్లా సామాజిక సమరసత ప్రముఖ గౌర్ల రాజు, గ్రామస్తులు బత్తుల సీతారాములు, దేవుళ్ళ భిక్షం, ఈర్ల గాంధీ, ఈర్ల సంజీవ, తదితరులు పాల్గొన్నారు.